

# హైదరాబాద్ వార్త


# సీటు..మహా రేటు!

-ఇంజనీరింగ్ కాలేజీల అడ్డగోలు దందా
-ఒక్కో సీటుకు రూ.10-25లక్షలపైనే
-కన్వీనర్ కోటా వర్తించని విద్యార్థులకు గాలం
-ప్రైవేటు కన్సల్టెన్సీల ఫోన్ల తాకిడి
-టాప్ టెన్ సీట్ల హామీ.. సీట్ల రిజర్వేషన్
-కౌన్సిలింగ్ కంటే ముందే బాహాటంగా వసూళ్లు



హైదరాబాద్, జూన్ 3 ప్రభాతవార్త

కౌన్సిలింగ్ కంటే ముందే ఇంజనీరింగ్ కాలేజీల సీట్ల దందా జోరందుకుంది. ప్రైవేటు ఎడ్యుకేషన్ కన్సల్టెన్సీల మధ్యవర్తిత్వంతో సీట్ల రిజర్వేషన్ ప్రక్రియకు తెరలేచింది. కన్వీనర్ కోటా కటాఫ్ కంటే అధిక ర్యాంకులు సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు సీట్ల టెన్షన్ పట్టుకుంది. ఇదే అంశం ఇంజనీరింగ్ కాలేజీలకు కాసులు కురిపిస్తోంది. కౌన్సిలింగ్ ప్రక్రియ ప్రారంభం కాకముందే పేరొందిన ప్రైవేట్ ఇంజనీరంగ్ కాలేజీలు నిబంధనలు గాలికొదిలి సీట్ల ప్రక్రియకు శ్రీకారం చుట్టాయి. దీంతో కన్వీనర్ కోటా వర్తించని విద్యార్థుల తల్లిదండ్రులకు కన్సల్టెన్సీల ఫోన్ల తాకిడి అధికమైంది. టాప్‌టెన్..టాప్ ట్వంటీ అంటూ కాలేజీల్లో సీట్లు ఇప్పిస్తామని గాలం వేస్తున్నాయి. ఏకంగా కాలేజీలకు తీసుకెళ్లి సీట్లు రిజర్వ్ చేయించడం బహిరంగ రహస్యంగా తయారైంది. కోర్సుల ఆధారంగా సగటున ఒక్కో సీటుకు రూ. 12 లక్షలు, 25లక్షల వరకు పలుకుతోంది. కొన్ని కాలేజీలు డొనేషన్ల పేరుతో భారీగా వసూళ్లకు సైతం దిగాయి. సీటు రిజర్వేషన్ చేసుకొని మరో 20 రోజుల్లో మొదటి సంవత్సరం ఫీజు చెల్లిస్తే సీటు ఇస్తామని స్పష్టం చేస్తుండగా, ఇంకొన్ని కాలేజీలు మాత్రం మొత్తం ఒకేసారి నగదు రూపంలో చెల్లిస్తేనే సీటు, విడతల వారీగా చెల్లిస్తే ఆ డొనేషన్ పెరుగుతుందని తేల్చి చెబుతున్నాయి. అందులో సైతం కేవలం నగదు రూపంలోనే చెల్లించాలని, ఆన్‌లైన్ చెల్లింపులను నిరాకరిస్తున్నాయి. సీటు అంశం మాట్లాడేటప్పుడు మాత్రం యాజమాన్యాలు జాగ్రత్తపడుతున్నాయి. సదరు పేరెంట్స్ మొబైల్ ఫోన్లను సెక్యూరిటీలో పెట్టి లోపలికి వచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నాయి. బేరసారాలు ముగియగానే తక్షణమే రూ. 50 వేలు చెల్లించి రిజర్వేషన్ చేసుకునే విధంగా ఒత్తిళ్లు తీసుకొస్తున్నట్లు తెలుస్తోంది.

## పెరిగిన డిమాండ్..

ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీలు మెకానికల్, సివిల్ విభాగాల్లో సీట్లు తగ్గించుకుని, కంప్యూటర్ సైన్స్, ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్), సైబర్ సెక్యూరిటీ, డేటాసైన్స్ కోర్సుల సీట్లు పెంచుకున్నాయి. ఆ సీట్లకున్న డిమాండ్‌ను సొమ్ము చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయి. తమ పిల్లలతో ఎలాగైనా కంప్యూటర్ సైన్స్ సంబంధిత కోర్సు చేయించాలని తల్లిదండ్రుల ఆశలు కాలేజీలకు కాసుల పంట పండిస్తోంది. ఇంజనీరింగ్ కాలేజీల్లో మెరిట్‌కు పాతర వేస్తుండగా.. సీట్లు అంగడి సరుకుగా మారాయి. వేలం మాదిరి రోజు రోజుకూ డిమాండ్ పెంచి మరీ డొనేషన్ల వసూలు చేస్తున్నాయి. బ్రాంచీలను బట్టి సొమ్ము చేసుకుంటున్నాయి. గతంలో సైతం మెరిట్ కాదు కదా.. అసలు జేఈఈ, ర్యాంకు, ఎంసెట్ రాయనివారికి కూడా సీట్లు లభించాయి. ప్రస్తుతం సైతం అదే పునరావృతం కాబోతోంది. టాప్ కాలేజీల్లోనే ఈ అడ్డగోలు దందా ఉండగా మిగతా కాలేజీల పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు.

## ముందుగానే 'బి' కేటరిగి సీట్లు..

జేఎన్టీయూ పరిధిలోనే సుమారు 199 కాలేజీలుండగా ప్రైవేట్ కాలేజీల్లో 70శాతం సీట్లు కన్వీనర్ కోటా ('ఎ' కేటగిరీ) ద్వారా.. మిగిలిన 30శాతం సీట్లు మేనేజ్‌మెంట్ కోటా ('బి' కేటగిరీ)లో ద్వారా భర్తీ చేసుకోవాల్సి ఉంటుంది. కన్వీనర్ కోటా పూర్తయిన తర్వాత మేనేజ్‌మెంట్ కోటాను భర్తీ చేయాలి.. కానీ కన్వీనర్ కోటా ప్రక్రియ కంటే ముందే..మేనేజ్‌మెంట్ కోటా సీట్లు అమ్మకాలపై యాజమాన్యాలు దృష్టి సారించాయి. మేనేజ్‌మెంట్ల సీట్ల భర్తీలో 15శాతం సీట్లను ఎన్నారై-ఎన్నారై స్పాన్సర్డ్ కోటాలో కేటాయించాలి. మరో 15శాతం సీట్ల భర్తీలో జేఈఈ మెయిన్ ర్యాంకర్లకు మొదటి ప్రాధాన్యం. ఎంసెట్ ర్యాంకర్లకు రెండో ప్రాధాన్యం ఇవ్వాలి. ఎవరూ లేకుంటే ఇంటర్మీడియట్ మార్కుల ఆధారంగా సీట్లను కేటాయించాలి. కానీ ఇవేవీ అమలు లేకుండా ఇష్టానుసారం ప్రవేశాలకు తెరలేచింది.

# వైభవంగా శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు

-శేషవాహనంపై శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారి ఊరేగింపు



పురవీధుల్లో శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారిని ఊరేగిస్తున్న దృశ్యం



కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డికి శ్రీవారి ఫోటోను బహుకరిస్తున్న డోనర్ త్రినాథ్‌బాబు

సైఫాబాద్, జూన్ 3 ప్రభాతవార్త:
లిబర్టీ వద్దగల తిరుమల తిరుపతి దేవస్థానములు (టిటిడి) బాలాజీ భవన్‌లోని కలియుగ దైవం శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం 20వ వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం అత్యంత అంగరంగ వైభవంగా ఘనంగా జరిగాయి. ఉదయం 6 గంటలకు ధ్వజారోహణ కార్యక్రమం జరగగా, 10 గంటలకు శేషవాహనంపై శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారి ఊరేగింపు అత్యంత వైభవంగా కన్నుల పండువలాగా పురవీధుల్లో సాగింది. ఈ ఊరేగింపులో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. గోవింద, గోవింద అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. గోవింద నామాలతో పురవీధులు మారుమ్రోగాయి. రోడ్డుకు ఇరువైపుల భక్తులు నిలబడి శ్రీవారిని దర్శించుకున్నారు. మంగళహారతులు పట్టారు. కొబ్బరికాయలు కొట్టారు. పూలు సమర్పించుకున్నారు. దేవాలయంలో సాయంత్రం 6 గంటలకు సహస్రదీపాలంకరణ వైభవంగా జరిగింది. రాత్రి 8 గంటలకు శ్రీహనుమంత వాహనంపైన శ్రీవారి ఊరేగింపు పురవీధుల్లో కొనసాగింది.

**ఊరేగింపుల సందర్భంగా పురవీధులు భక్తులతో కిక్కిరిసిపోయాయి.**

దేవాలయం వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి శ్రీవారిని దర్శించుకుని ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. ఆయనకు వేద పండితులు అశీర్వచనాలు అందజేశారు. దోనర్ త్రినాథ్‌బాబు కిషన్‌రెడ్డికి శ్రీవారి పోటోను బహుకరించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మీడియాతో మాట్లాడుతూ శ్రీవారి బ్రహ్మోత్సవాలు ప్రతి ఏడాది ఘనంగా జరుపుకుంటున్నామని, తిరుమలకు వెళ్ళలేని భక్తులు ఇక్కడ స్వామివారిని రోజు ప్రత్యక్షంగా దర్శించుకుంటున్నారని తెలిపారు. లోక కళ్యాణం కోసం ఈ బ్రహ్మోత్సవాలను నిర్వహించడం జరుగుతున్నదని, తెలుగు రాష్ట్రాల ప్రజలు శ్రీవారి అశీస్సులతో, సుఖ సంతోషాలతో జీవించాలని కోరుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ప్రకృతి వైపరీత్యాలు లేకుండా, పాడిపంటలతో రాష్ట్రం సుభిక్షింగా ఆయురారోగ్యాలతో ఉండాలని, శ్రీవారి అశీస్సులు ఎల్లవేళల ప్రజలకు ఉండాలని స్వామిని ప్రార్థిస్తున్నట్లు చెప్పారు. ఈ బ్రహ్మోత్సవాల్లో టిటిడి ఎఇవో రమేష్, ఉద్యోగులు శ్రీనివాస్‌ప్రభు, హరిబాబు, శ్రీనివాసమణికంఠ, లక్ష్మిపతి తదితరులతో పాటు శ్రీవారి సేవకులు భక్తులకు విశేషమైన సేవలు అందించారు. బ్రహ్మోత్సవాలు సందర్భంగా ఉదయం నుంచి రాత్రి వరకు వేలాది మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. అర్చకులు తీర్థప్రసాధాల వితరణ గావించారు. ఉదయం అల్పహారం, మధ్యాహ్నం, రాత్రి భక్తులకు అన్న ప్రసాద వితరణ జరిగింది.

# డ్రగ్స్ సరఫరాదారులు అరెస్టు

కుత్బుల్లాపూర్, జూన్ 3 ప్రభాతవార్త

అప్పులబాధతో ఒకరు...చాలీచాలని ఉద్యోగంలో త్వరగా ఎదుగలేమనే ఉద్దేశంతో మరొకరు... పోలీసులే తమ వెంట ఉన్నారనే ధీమాతో మరొకరు ఇలా ఎనమిదిమంది డ్రగ్స్ ముఠాగా ఏర్పడి సుమారు కోటి రూపాయల విలువైన డ్రగ్స్‌ను సరఫరాచేస్తూ ఐదుగురు యువకులు పట్టుబడిన సంఘటన కూకట్‌పల్లి జయనగర్‌లో చోటుచేసుకుంది. బాలానగర్ ఇంచార్జి పోలీసు డిప్యుటీ కమిషనర్ కోటిరెడ్డి, స్పెషల్ ఆపరేషన్‌టీమ్ డిసిపి శ్రీనివాస్‌లు మంగళవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం బాపట్ల జిలల్లాకు చెందిన ఎనమిదిమంది వివిధ వృత్తుల్లో వుండేచిరు వ్యాపారులు, ఉద్యోగులు ఈకేసులో ప్రధాన నిందితులుగా ఉన్నారంటే అశ్చర్యం కలుగుతుందని పోలీసులు తెలిపారు. తిరుపతికి చెందిన ఎ.ఆర్. కానిస్టేబుల్ గుణశేఖర్ నాయకుడిగా ఈ డ్రగ్స్ దందా నడుపుతున్నాడు. గుణశేఖర్‌తో పాటు అతని స్నేహితుడు ఉన్నం సురేంద్రతో కలిసి డ్రగ్స్ వ్యాపారాన్ని నిర్వహించేందుకు సిద్దమయ్యారు. వ్యాపారంలో భాగంగా బాపట్లకు చెంది కాంట్రాక్టరుగా పనిచేస్తున్న దొంతిరెడ్డి హరిబాబురెడ్డి(38), బాపట్ల అద్దండిలో ఫాస్ట్ ఫుడ్ సెంటర్‌ను నడుపుతున్న చెగుడు వెర్సి మార్గరెట్(34), బాపట్ల అద్దంకి చెందిన ప్రైవేట్‌లోన్ల ఎజెంట్ షేక్‌మస్తాన్‌వలి (40), బాపట్ల అద్దంకి చెందిన దేవరాజు ఏసుబాబు(29)లు కలిసి డ్రగ్స్ సరఫరా ముఠాగా ఏర్పడ్డారు. ప్రధాన సూత్రధారి అయిన ఏ.ఆర్. కానిస్టేబల్ తిరుపతికి చెందదిన ఎ.ఆర్.కానిస్టేబుల్ గుణశేఖర్ మొట్టమొదటగా సుమారు 500 గ్రాముల కొకైన్‌ను బెంగుళూరులో విక్రయించాడు. బెంగుళూరులో డ్రగ్స్ సరఫరా విజయవంతం కావడంతో పెద్దఎత్తున డ్రగ్స్‌ను హైదరబాద్‌కు సరఫరాచేస్తే కోట్లలో ఆర్జించవచ్చునని తన స్నేహితుడు ఉన్నం సురేంద్రతో కలిసి పథకం ప్రకారం ఆంధ్రప్రదేశ్ నుండి కూకట్‌పల్లి జయనగర్‌లో కోటి రూపాయల డ్రగ్స్‌ను విక్రయించేందుకు ఎదురుచూస్తుండగా కూకట్‌పల్లి పోలీసుతోపాటు స్పెషల్ ఆపరేషన్‌టీమ్‌తో కలిసి అదుపులోకి తీసుకోవడం జరిగిందని తెలిపారు. ప్రధాన సూత్రధారి, పాత్రధారి అయిన ఎ.ఆర్. కానిస్టేబుల్ గుణశేఖర్ తప్పించుకున్నాడని అతడు చిక్కితే డ్రగ్స్‌కు సంబందించి పూర్తి వివరాలు తెలుస్తాయని బాలానగర్ ఇంచార్జి డిప్యుటీ పోలీసు కమిషనర్ కోటిరెడ్డి, ఎస్‌ఓటి డిసిపి శ్రీనివాస్‌లు తెలిపారు. డ్రగ్స్ విక్రయిస్తూ పట్టుబడిన ఐదుగురు నిందితులను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు పరారీలో ఉన్న వారిపై కూడా నిరంతర నిఘాతో అదుపులోకి తీసుకుని విచారిస్తామని వారుతెలిపారు.

# షార్ట్ సర్క్యూట్‌తో కారులో మంటలు



హైదరాబాద్, జూన్ 3, ప్రభాతవార్త

గచ్చిబౌలిలో అగ్ని ప్రమాదం జరిగింది. కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో కారు పూర్తిగా దగ్ధమైంది. కారులో ఉన్న ఇద్దరు వ్యక్తులు సురక్షితంగా బయటపడ్డారు. కారు ఇంజన్ నుంచి మంటలు రావడం గమనించిన ప్యాసింజర్లు వెంటనే అప్రమత్తమై కారు నుంచి దిగిపోయారు. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయం ఎదుగా ఈ ఘటన జరిగింది. కారు రన్నింగ్‌లో ఉండగానే మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంపై సమాచారం అందుకున్న వెంటనే అక్కడకు చేరుకున్న పోలీసులు,అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ క్రమంలో గచ్చిబౌలి వేళ్లే మార్గంలో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. అగ్ని ప్రమాదంలో కారు పూర్తిగా దగ్ధమైంది.కారులో ఉన్న ఇద్దరు వ్యక్తులు సురక్షితంగా బయటపడ్డారు. కారు ఇంజన్ నుంచి మంటలు రావడం గమనించిన ప్యాసింజర్లు వెంటనే అప్రమత్తమై కారు నుంచి దిగిపోయారు. కొన్ని నిమిషాల వ్యవధిలోనే మంటలు కారు మొత్తం వ్యాపించాయి. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటన ప్రదేశానికి వచ్చేలోపే కారు పూర్తిగా కాలిపోయింది. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.ఈ ప్రమాదంలో కారు సగం వరకు కాలిపోయింది. ఈ క్రమంలో సైబర్ టవర్ నుంచి మైండ్ స్పేస్ మార్గంలో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ప్రమాదానికి గురైన కారును పోలీసులు పక్కకు జరిపించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

# అభివృద్ధి పనులు ప్రారంభించిన మంత్రి శ్రీధర్ బాబు



మల్లికార్జున నగర్‌లో పార్కు ను ప్రారంభిస్తున్న మంత్రి శ్రీధర్ బాబు,కార్పొరేటర్ రాగుల తదితరులు.

వనస్థలిపురం. జూన్.3. ప్రభాతవార్త :
వనస్థలిపురం డివిజన్ పరిధిలోని మల్లికార్జున నగర్ ,జహంగీర్ నగర్ కాలనీలలో రాష్ట్ర ఐ. టి.మంత్రి శ్రీధర్ బాబు ఎంఎల్సీ దయానంద్, కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర రెడ్డితో మంగళవారం సాయంత్రం ప్రారంభించారు. జహంగీర్ నగర్ లో రోడ్లు, మల్లి కార్జున నగర్ లో సుమారు 49 లక్షల రూపాయల తో నిర్మించిన పార్కు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అన్ని రంగాలలో రాష్టాన్ని అభివృద్ధి దిశగా పనులు చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా బి.యన్. రెడ్డి.నగర్ లోని వివిధ కాలనీలలో గల రిజిస్ట్రేషన్ సమస్యను పరిష్కరించాలని మంత్రికి వినతిపత్రం అందజేశారు. ముఖ్యమంత్రి తో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో టి.పి.సి.సి.చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్, సీనియర్ నాయకుడు ముద్దగౌని రామ్మోహన్ గౌడ్,రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివ చరణ్ రెడ్డి,మాజీ కార్పొరేటర్ లక్మి ప్రసన్న,హైదరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు నేలపాటి రామారావు, పాష్యం అశోక్ గౌడ్, మల్లికార్జున నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ప్రేమ్ కుమార్,నిరంజన్,వెంకటేష్,వెంకటేష్ గౌడ్, ఎల్లయ్య గౌడ్,చంద్రశేఖర్, ఇగ్భాల్,హరిందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కెబిఆర్‌పార్కును పరిశీలించిన గ్రేటర్ కమిషనర్ ఆర్.వి.కర్ణన్

-వాకర్స్‌కోసం ఏర్పాటు చేసిన పనులన్ని త్వరగా పూర్తి చేయాలని ఆదేశం



పార్కులో చేపట్టిన పనులను కమిషనర్‌కు వివరిస్తున్న అధికారులు

హైదరాబాద్,జూన్ 3, ప్రభాతవార్త:
వాకర్స్ సౌకర్యం కోసం ఏర్పాటు చేసిన పనులను వినూత్నంగా చేపట్టి త్వరగా పూర్తిచేయాలని జిహెచ్ఎంసి కమీషనర్ ఆర్.వి.కర్ణన్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం కేబీఆర్ పార్కులో చేపట్టిన పనులను పరిశీలించారు. లైసెన్స్ తీసుకున్న పెట్ డాగ్స్‌ను మాత్రమే పార్కులోకి తీసుకురావాలని కమీషనర్ ఆదేశించారు. కేబీఆర్ చుట్టూ హెచ్ సిటీ ద్వారా చేపట్టే ఫ్లైఓవర్లు, అండర్ పాసులు కోర్టు ఆదేశాల మేరకు నిర్మిస్తున్నారా అంటూ ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులను వివరణ కోరగా, సెన్సిటివ్ జోన్ పరిధిలోనే పనులు చేపట్టినట్లు ప్రాజెక్టు ఇంజనీర్లు కమీషనర్ కు వివరించారు. ఈకార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ సుభద్ర దేవి, డిసి సమ్మయ్య, ప్రాజెక్టు ఈఈ మాన్య నాయక్, ఎస్.ఈ శ్రీలక్ష్మి, డిప్యూటీ ఈఈ హరీష్, సర్కిల్ ఈఈ విజయ కుమార్ పాల్గొన్నారు.

# గ్రేటర్ పరిధిలోని బార్లకు డిమాండ్

-ఇప్పటివరకు 24 బార్లకు 359 దరఖాస్తులు

**హైదరాబాద్, జూన్ 3,ప్రభాతవార్త:** హైదరాబాద్ విశ్వనగరంగా పేరొందింది. తెలంగాణలో ఉన్న జనాభాలో సగం జనాభా ఇక్కడే నివాసముంటారు. కొత్తబట్టలు, కార్లు ఇతర సామాగ్రిని కొనుగోలు చేయడానికి నిత్యం లక్షల్లో జనాలు ఇతర జిల్లాల నుంచి రాకపోకలు సాగిస్తారు.హైదరాబాద్ మహానగరంలో జీవన ప్రమాణాలు పెరిగాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇందుకు అనుగుణం ఎక్సైజ్ శాఖ జీహెచ్ఎంసీలోని 24 బార్లను పునరుద్దరణకు దారఖాస్తులను స్వీకరిస్తుంది.జీహెచ్ఎంసీ పరిధిలో 24 బార్లతోపాటు సరూర్‌నగర్ జాల్‌పల్లి, మహబూబ్‌నగర్, నిజామాబాద్, బోధన్‌లో ఒక్కొక్క బార్‌కు దరఖాస్తులను ఆహ్వానించింది. అయితే జీహెచ్ఎంసీలోని 24 బార్లకు ఇప్పటికే 359 దరఖాస్తులు వచ్చాయి. ఇంకా దరఖాస్తుల స్వీకరణకు ఈ నెల 6 వరకు గడువు ఉంది. మిగిలిన మూడు రోజుల్లో భారీగా దరఖాస్తులు భారీగావస్తామని అంచనాలు ఉన్నాయి. దీనికి కారణం ఈ మధ్యనే రూరల్‌లోని బార్లకు పిలిచిన బార్లకు భారీగా దరఖాస్తులు వచ్చాయి.జీహెచ్ఎంసీలోని బార్లకు భారీగా దరఖాస్తులు వచ్చే అవకాశాలు ఉన్నాయనే అలోచనలతో ఎక్సైజ్ అధికారులు ఏర్పాట్లపై దృష్టి పెట్టారు. మూడు రోజుల్లో బార్లకు వేల సంఖ్యలో దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని భావించి నాంపల్లిలోని అబ్కారీ భవన్‌లో అన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఈ మూడు రోజుల్లో మూడు వేల నుంచి ఐదు వేల దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని ఎక్సైజ్ భావిస్తున్నారు. దరఖాస్తులు తీసుకొవడానికి నాంపల్లి కార్యాలయంలో ఎలాంటి ఇబ్బందులు లేవని, ఈ మేరకు అన్ని ఏర్పాట్లు చేశామని రంగారెడ్డి డిప్యూటి కమిషనర్ పి.దశరథ్ తెలిపారు.

# గోషామహల్ పోలీస్ గ్రౌండ్‌లో ఉస్మానియా ఆసుపత్రి

-పోలీసు శాఖకు చెందిన అన్ని విభాగాల తరలింపు
-గ్రౌండ్‌లో పోలీసు గుర్రపుశాలల తరలింపు పనులను పరిశీలించిన సిపి .సివి ఆనంద్



గోషామహల్ పోలీస్ స్టేడియంలో పోలీసు గుర్రపుశాలల తరలింపు పనుల పరిశీలించి మాట్లాడుతున్న సీపీ సీవీ ఆనంద్

హైదరాబాద్, జూన్ 3, ప్రభాతవార్త
ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణం పనులు త్వరలో జరుగుతున్న నేపథ్యంలో తమ పోలీస్ శాఖకు చెందిన బ్లాక్స్‌ను తరలిస్తున్నామని నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ తెలిపారు. చాలా సంవత్సరాలుగా ఉన్న హార్స్ గ్రౌండ్‌ను తాత్కాలికంగా తరలించినట్లు చెప్పారు.మంగళవారం గోశామహల్ పోలీస్ గ్రౌండ్‌ను నగర పోలీస్ కమిషనర్ సందర్శించారు. గోశామహల్ పోలీస్ గ్రౌండ్‌లో నూతన ఉస్మానియా ఆసుపత్రి నిర్మిస్తున్న సందర్భంగా హార్స్ గ్రౌండ్‌ను అక్కడి నుంచి చక్నావాడి దగ్గరలో షెడ్డును నిర్మించారు. ఈ క్రమంలో నూతనంగా ఏర్పాటు చేసిన తాత్కాలిక హార్స్ గ్రౌండ్ ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం మహిళా పోలీసులకు సెల్ఫ్ డిఫెన్స్‌పై ట్రెనింగ్‌ను పరిశీలించారు సీపీ. ట్రెనింగ్‌లో నేర్చుకున్న సెల్ఫ్ డిఫెన్స్ కిట్స్‌ను ట్రెనీ మహిళా పోలీసులు ఈ సందర్భంగా ప్రదర్శించారు. ఆపై సీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ..ఉస్మానియా నూతన భవనం నిర్మించడానికి ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఆసుపత్రి నిర్మాణం పనులు త్వరలో జరుగుతున్న నేపథ్యంలో తమ పోలీస్ శాఖకు చెందిన బ్లాక్స్‌ను తరలిస్తున్నామని తెలిపారు. చాలా సంవత్సరాలుగా ఉన్న హార్స్ గ్రౌండ్‌ను తాత్కాలికంగా తరలించినట్లు తెలిపారు. నేటితో తమ శాఖకు చెందిన అన్ని విభాగాలను తరలించి వైద్య శాఖకు అప్పగించామన్నారు. పోలీస్ శాఖకు ఇక్కడే 11 ఎకరాలు కేటాయించారని అన్నారు. 11 ఎకరాల్లో తమ 7 జోన్లకు చెందిన పలు కాంప్లెక్స్‌లను నిర్మిస్తామని చెప్పారు. టీటీఐ ప్రక్కన మరో 2 ఎకరాలు కేటాయించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో రూ.55 కోట్లు కేటాయించారన్నారు. పోలీస్ కార్పొరేషన్ ద్వారా నిర్మాణాలు జరుగుతాయన్నారు. తాత్కాలికంగా హార్స్ టేబుల్, డాగ్ కెనల్‌ను నిర్మించినట్లు వెల్లడించారు. ఒక ఏడాదిలో తమ పోలీస్‌కు సంబంధించిన భవనాల పనులను పూర్తి చేస్తామన్నారు. స్విఫ్ట్ ఉమెన్ యాక్షన్ టీం తయారు చేశామన్నారు. మహిళలను ప్రొటెక్ట్ చేసినప్పుడు వారిని సురక్షితంగా తరలించడానికి ఈ టీమ్ పనిచేస్తుందని.. ఇదీ ఈ టీమ్ ప్రత్యేకత అని తెలిపారు. మొదటి టీం 35 మందితో స్విఫ్ట్ ఉమెన్ యాక్షన్ టీమ్ సిద్ధం చేశామని సీపీ సీవీ ఆనంద్ పేర్కొన్నారు. ఈ టీమ్‌కు "స్విఫ్ట్ ఉమెన్ యాక్షన్ టీమ్" అని నామకరణం చేశారని తెలిపారు.వీరికి గత కొన్ని రోజులుగా కరాటేలో శిక్షణతో పాటు, ధర్నాల సమయాలలో మహిళలను ఏ విధముగా అదుపులోకి తీసుకుని సురక్షితంగా తరలించాలనే దానిపై ప్రత్యేకమైన శిక్షణ ఇచ్చామని కమిషనర్ వివరించారు. త్వరలో ఇంకా కొంతమందిని చేర్చుకుని 42 మందితో రెండు ప్లాటూన్‌లుగా విభజిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమానికి రక్షిత కృష్ణ మూర్తి డిసిపి సిఎఆర్ హెడ్ క్వార్టర్స్,డి.కిష్టయ్య అడిషినల్ డిసిపి, ఎన్.భాస్కర్ అడిషినల్ డిసిపి, వెస్ట్ జోన్ అడిషినల్ డిసిపి ఇక్బాల్ సిద్ధిఖీ ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# చర్చనా ..రచ్చనా..?

-నేడు జిహెచ్ఎంసి కౌన్సిల్ మీటింగ్
-ఉదయం 10.30గంటలకు సభ ప్రారంభం
-వ్యూహప్రతివ్యూహాల్లో అధికార విపక్షాలు





కౌన్సిల్ సమావేశానికి ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది

హైదరాబాద్, జూన్ 3,ప్రభాతవార్త:
జిహెచ్ఎంసిపాలకమండలి సమావేశం నేడు జరగనుంది. ఉదయం 10.30 గంటలకు మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ అధ్యక్షతన సమావేశం నిర్వహించనుంది. ఈనేపథ్యంలో సమావేశానికి సంబంధించి అధికార, విపక్ష పార్టీలకు చెందిన కార్పొరేటర్లు వ్యూహ,ప్రతివ్యూహాలు రచిస్తున్నారు. ముఖ్యంగా అధికారపార్టీ కాంగ్రెస్‌కు కౌన్సిల్‌లో కాంగ్రెస్‌కు 19మంది కార్పొరేటర్లే ఉండగా.. అధికారులను పలు అంశాల్లో నిలదీసి ఇరకాటంలో పెట్టేందుకు విపక్ష పార్టీలైన బిఆర్ఎస్, బిజెపిల కార్పొరేటర్లు వ్యూహం సిద్ధం చేసుకున్నారు. ఈసమావేశానికి మొత్తం 120 ప్రశ్నలు రాగా ,అందులోంచి కేవలం 24ప్రశ్నలను మాత్రమే సభలో ప్రస్తావించేందుకు మేయర్ గద్వాల విజయలక్ష్మీ ఎంపిక చేసినట్లు తెలుస్తుంది.ముఖ్యంగా స్టాండింగ్ కమిటీలో తిరస్కరించిన సీఆర్ ఎంపీ2 ప్రతిపాదనను నేటి కౌన్సిల్ సమావేశం ముందు పెట్టనున్నట్లు తెలిసింది. సీఆర్ఎంపీ1లో కేటాయించిన సుమారు 744.22 కి.మీ. రోడ్లకు మరిన్ని రోడ్లను జోడించి, మొత్తం 1142.54 కి.మీ.ల రోడ్ల నిర్వాహణను రానున్న అయిదేళ్ల పాటు (2025-2030) ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించేందుకు, అందుకు రూ. 3825 కోట్లకు మంజూరీ కోరుతూ బుధవారం జరగనున్న కౌన్సిల్ సర్వసభ్య సమావేశం ముందు ప్రతిపాదనలు పెట్టేందుకు సిద్దమైనట్లు తెలుస్తుంది. అలాగే ఇటీవలే జీహెచ్ఎంసీలో వర్షం సహాయక చర్యల్లో భాగంగా సమకూర్చాల్సిన వాహనాల టెండర్లలో జరిగిన అక్రమాలపై కూడా మజ్లీస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు అధికారులను నిలదీసేందుకు ప్లాన్ చేసినట్లు విశ్వసనీయ సమాచారం.

## ఎన్నికల్లో ముస్లిం మైనార్టీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సయ్యద్ అజీజ్‌పాషా

**సైఫాబాద్, జూన్ 3 ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ముస్లిం మైనార్టిలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఆల్ ఇండియా ముస్లిం మైనార్టి ఆర్గనైజేషన్ డిమాండ్ చేసింది. మైనార్టి ముస్లింలకు సబ్‌ప్లాన్ ఏర్పాటు చేసి తగినన్ని నిధులు కేటాయించి అమలు చేయాలని ఆర్గనైజేషన్ ప్రతినిధుల కోరారు. ఈ మేరకు మంగళవారం ఎన్‌ఎస్‌ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిపిఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్‌పాషా, అర్గనైజేషన్ ప్రతినిధులు సయ్యద్ ముక్తార్ హుస్సేన్, ఎంఎ సిద్ధిఖీ తదితరులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ముస్లిం మైనార్టిలకు బడ్జెట్‌లో నిధులు కేటాయించి ఖర్చు చేయడం లేదని, అందువల్ల సబ్‌ప్లాన్‌ను ఏర్పాటు చేసి నిధులు కేటాయించాలని కోరారు. వక్ఫ్‌బోర్డుకు న్యాయమైన అధికారాలు ఇవ్వాలని, రాష్ట్రానికి చెందిన 5 లక్షల కోట్ల విలువైన వక్ఫ్‌బోర్డు భూములను పరిరక్షించాలని, వచ్చే మంత్రి వర్గ విస్తరణలో ముస్లిం మైనార్టిలకు మంత్రి ఇవ్వాలని, స్మశాన వాటికి లకు స్థలాలను కేటాయించాలని డిమాండ్ చేశారు.

## 'విద్యా విరచితాలు'లోని రచనలు మహిళలకు మేల్కొలుపు


విద్యా విరచితాలు' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రవికుమార్

**సైఫాబాద్, జూన్ 3 ప్రభాతవార్త:** దోడ్డపనేని శ్రీవిద య రచించిన 'విద్యా విరచితాలు' పుస్తకావిష్కరణ కార్యక్రమం మంగళవారం అమర్త కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగింది. ఈ కార్యక్రమంలో అమర్త కుమార్ జైన్ సంఘం అధ్యక్షుడు ఎస్.రవికుమార్, అఖిల భారత పద్మశాలి సంఘం అధ్యక్షుడు తుమ్మ సత్యనారాయణ, గాయకుడు సునీల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీవిద్య రచించిన విద్యా విరచితాలు పుస్తకం అందరూ చదవదగదని, ఎంతో కష్టపడి ఆమె ఈ పుస్తకాన్ని రచించడం జరిగిందన్నారు. ముఖ్యంగా మహిళలకు ఈ పుస్తకంలోని రచనలు ఎంతో మేల్కొలుపుతాయన్నారు. కార్యక్రమంలో రచయిత శ్రీవిద్య పాల్గొన్నారు

## శ్మశాన వాటికను రక్షించండి

**-అధికారులకు రాష్ట్ర కురమ సంఘం ఉపాధ్యక్షుడు సత్యనారాయణ విజ్ఞప్తి**


సికింద్రాబాద్ జీహెచ్ఎంసీ జోనల్ కమీషనర్ రవికిరణ్‌కు ఫిర్యాదు చేస్తున్న చీరె సత్యనారాయణ కురమసంఘం నేతలు.

**బేగంపేట జూన్ 3,ప్రభాతవార్త**

సనత్‌నగర్ నియోజకవర్గం పరిధిలోని బన్సీలాల్ పేట డివిజన్ గాంధీనగర్ లో వందేళ్ల నాటి కురమ కులస్థులకు సంబంధించిన శ్మశాన వాటిక స్థలాన్ని గుర్తు తెలియని వ్యక్తులు కబ్జా చేసారని, కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం రాష్ట్ర కురమ సంఘం ఉపాధ్యక్షుడు చీరె సత్యనారాయణ (శ్రీకాంత్) జీహెచ్ఎంసీ అధికారులను కల్సి విజ్ఞప్తి చేసారు.కబ్జాకు గురైన శ్మశాన వాటిక స్థలాన్ని ఆయన కురమ సంఘం నేతలతో కల్సి వెళ్లి పరిశీలించారు.అనంతరం సికింద్రాబాద్ జీహెచ్ఎంసీ జోనల్ కమీషనర్ రవికిరణ్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసారు.ల్యాండ్ మాఫియా ముఠా నకిలీ ధృవ పత్రాలు సృష్టించి కబ్జా చేసే ప్రయత్నం చేస్తున్నారని వివరించారు.అనంతరం సికింద్రాబాద్ తహశీల్దార్ పాండు నాయక్‌కు కూడా ఫిర్యాదు చేసారు.హైడ్రా కమీషనర్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసారు.అనంతరం హైడ్రా ఏసీపీ తిరుమల్‌ను కల్సి పూర్తి వివరాలను అందజేసారు.అనంతరం చీరె శ్రీకాంత్ మాట్లాడుతూ కబ్జాకు గురైన కురమల శ్మశాన వాటిక స్థలాన్ని కాపాడాలని,కోరారు.ఈ కార్యక్రమంలో కురమ సంఘం నేతలు సునీల్,శివ,ప్రసాద్,నటరాజ్,ప్రవీణ్,సుశీల్,వినోద్,యశ్వంత్,దినేష్,రాజు,సంతోష్ తదితరులు ఉన్నారు.

### నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎసిపికి అభినందనలు


ఎసిపి శశాంక్‌రెడ్డిని అభినందిస్తున్న నేతలు

**సికింద్రాబాద్, జూన్ 3 ప్రభాతవార్త:**

చిలకలగూడ డివిజన్ ఏసీపీగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన శశాంక్‌రెడ్డికి లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షులు గుర్రం పవన్ కుమార్ గౌఅభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కంది నారాయణ, బాబురావు, సునీల్, శైలందర్, రవీందర్ సాగర్, అజీజ్, నర్సింగ్ రావులు పాల్గొన్నారు.

## వరద ముంపు కలగకుండా చర్యలు తీసుకోవాలి


చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ వెంకన్నకు వినతి పత్రం అందజేస్తున్న బిజెపి నాయకులు

**చార్మినార్,జూన్ 3 ప్రభాతవార్త :** పాతబస్తీ హనుమాన్ నగర్ కాలనీ ఫేస్ -2లో వరద ముప్పు లేకుండ తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ హనుమాన్ నగర్ కమిటి సభ్యులు చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ వెంకన్నను కలిసి వినతి పత్రం అందజేశారు. గత ఇరవై సంవత్సరాలు నుంచి వర్షా కాలం సమయంలో హనుమాన్ నగర్ కాలనీ ఫేస్- 2 వరద ముప్పుకు గురివుతున్న దని,కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పాలవుతున్నారని వారు జోనల్ కమిషనర్‌కు అంద జేసిన వినతి పత్రంలో పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో హనుమాన్ నగర్ కాలనీ కమిటి చైర్మన్ నరసింహ గౌడ్,అధ్యక్షులు ఆశిష్ దూబే,ప్రధాన కార్యదర్శి నరహరి గౌడ్,సలహాదారులు ఏ.శివచంద్రగిరి,కమిటి సభ్యులు ఠాకూర్ నర్సింగ్ సింగ్,జి.శివ కమార్,శ్యామ్,అమృత్ రాజ్,ప్రమోద్ పాల్గొన్నారు.

## ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు అమలు చేసేంతవరకు సిఎం సభలు అడ్డుకుంటాం


సమావేశంలో మాట్లాడుతున్న సుల్తాన్ యాదగిరి, చిత్రంలో ప్రఫుల్ రామ్‌రెడ్డి తదితరులు

**సైఫాబాద్, జూన్ 3 ప్రభాతవార్త:** గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయనందుకు నిరసనగా నేటి నుంచి ప్రభుత్వం చేపట్టే ప్రతి కార్యక్రమాన్ని అడ్డుకుంటామని, సిఎం రేవంత్‌రెడ్డి సభలు, సమావేశాలను కూడా అడ్డుకుంటామని తెలంగాణ ఉద్యమకారుల జెఎసి హెచ్చరించింది. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జెఎసి చైర్మన్ సుల్తాన్ యాదగిరి మాట్లాడుతూ సోమవారం జరిగిన తెలంగాణ రాష్ట్ర అవతరణ ఉత్సవాల్లో తెలంగాణ ఉద్యమకారుల గురించి ప్రభుత్వం ఏదైనా ప్రకటన చేస్తుందోనని ఎంతో అశపడ్డారని కాని సిఎం ప్రస్తావించక పోవడం దారుణమన్నారు. తూపాకి తూటాలకు, లాఠిదెబ్బలకు తెలంగాణ ఉద్యమకారులు బయపడేవారు కాదని నిరసన గళాన్ని విప్పుతామని, న్యాయం జరిగేంతవరకు ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఉద్యమకారులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి, ఉద్యమకారులను గుర్తించాలని, నెలకు 30 వేల రూపాయలు పెన్షన్ చెల్లించాలని, 250 గజాల స్థలాన్ని పంపిణి చేయాలని డిమాండ్ చేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం దోంగలు, దోపిడీదారులు, దోరలదని, అందుకే ఆ పార్టీని ఓడించి, కాంగ్రెస్ పార్టీని గత అసెంబ్లీ ఎన్నికల్లో ఉద్యమకారులు గెలిపించడం జరిగిందన్నారు. బిఆర్ఎస్ పార్టీని ఎవరు నమ్మరని ఎప్పటికి వ్యతిరేకిస్తూనే ఉంటామని, నియంతృత్వ పాలన చేసిన బిఆర్ఎస్ ఎప్పటికి అధికారంలోకి రాదని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జెఎసి అధ్యక్షుడు తుమ్మల ప్రఫుల్ రామ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శులు బత్తుల సమ్మయ్య, క్రిస్టోఫర్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డుకు అడ్డంగా నిర్మించిన గోడను తొలగించాలి


రాజేంద్రనగర్ నియోజకవర్గం బిజెపి ఇంఛార్జి తోకల శ్రీనివాస్ రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

**మైలార్‌దేవ్‌పల్లి,జూన్ 3 ప్రభాతవార్త :** శివరాంపల్లి రైల్వేస్టేషన్ వద్ద మూడు సంవత్సరాలు క్రితం రైల్వే డిపార్టుమెంట్ మరమ్మతుల పేరుతో రోడ్డుకు అడ్డంగా గోడను నిర్మించటంతో పలు బస్తీలకు చెందిన ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురివుతున్నారని,సమస్యను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బిజెపి అధ్యక్షులు గోదా పాండు యాదవ్ ఆధ్వర్యంలో పలు బస్తీలకు చెందిన ముఖ్య నాయకులు రాజేంద్రనగర్ నియోజకవర్గం బిజెపి ఇంఛార్జి తోకల శ్రీనివాస్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు.రోడ్డుకు అడ్డంగా గోడను నిర్మించటంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారని,గత 40 సంవత్సరాలు నుంచి బాబుల్‌రెడ్డి నగర్, కాటేదాన్,మైలార్‌దేవ్‌పల్లి,సాయి బాబానగర్,బృందావన్ కాలనీ,ఆదర్శనగర్,మోహన్ రెడ్డి నగర్,ప్రగతి కాలనీ ప్రజలు ఈ ప్రాంతం మీదుగా వెళు తుండేవారని వారు వినతి పత్రంలో పేర్కొన్నారు.ఈ సందర్భంగా రాజేంద్ర నగర్ నియోజకవర్గం బిజెపి ఇంఛార్జి తోకల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ చేవెళ్ల ఎంపి విశ్వేశ్వర్‌రెడ్డి,రైల్వే అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించటానికి కృషి చేస్తానని తెలిపారు.కార్యక్రమంలో మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బిజెపి అధ్యక్షులు పాండు యాదవ్,వెంకట రమణ, సంతు గౌడ్,రావుల భాస్కర్,బొమ్మరాజు నర్సింహ్మా, మధుసూధన్ రెడ్డి,గోపాల్ నాయక్, కిషన్,కుర్మయ్య, శంకర్,చింటూ రెడ్డి,కిరణ్,శేఖర్,రమేష్ యాదవ్, సదానంద్,చెన్నప్ప,విశాల్,పవన్,శశికాంత్, శివ,యాదగిరి, జైరామ్,మల్లేష్,ఉమేష్ పాల్గొన్నారు.

## కెపిహెచ్‌బి కాలనీలో ప్రభుత్వ ఆసుపత్రి నిర్మించాలని నిరసన


నిరసన తెలుపుతున్న నాయకులు

**కెపిహెచ్బి కాలనీ, జూన్ 3, ప్రభాతవార్త**

కెపిహెచ్బి డివిజన్ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కేపిహెచ్బి డివిజన్లోని ప్రభుత్వాసుపత్రి నిర్మించాలని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు సంవత్సరాల క్రితం గత మాజీ ఆరోగ్య శాఖ మంత్రి హరీష్ రావు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చేతుల మీదుగా 36 కోట్ల రూపాయల వ్యయంతో ఒక ఎకరా 17 గుంటల స్థలంలో వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మించేందుకు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆనాటి మంత్రి హరీష్ రావు శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత చేసిన పని ఏంటంటే ఫౌండేషన్ రాయి బద్దలు కొట్టడం తప్ప కనీసం ప్రజలకు ఉపయోగపడే ఆసుపత్రి నిర్మించాలన్న జ్ఞానం లేదని అంతేకాకుండా 3వ ఫేస్‌లో ఉన్నటువంటి రమ్య గ్రౌండ్ వద్ద సొంత నిధులతో తాను స్కూల్ నిర్మిస్తానన్నా ఒక్క అడుగు ముందుకు కదలనివ్వడం లేదని ఇప్పటికే కోటి రూపాయలు ఖర్చు చేశామని ఆ స్థలం కూడా స్వాధీనం పరుచుకోకుండా తాత్సారం చేస్తున్నారని అన్నారు. కలెక్టర్‌కు ఎన్నిసార్లు విన్నవించుకున్నా కూడా ముందుకు వెళ్లడం లేదని అంటే ప్రజలకు ఉపయోగపడే పనులను అడ్డుకోవడమే కాంగ్రెస్ పార్టీ పని అంటూ నిరసన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తెలుసుకొని ప్రభుత్వ ఆసుపత్రి నిర్మించాలని అత్యధిక జనాభా ఉండే కెపిహెచ్బి డివిజన్లో ఆసుపత్రి లేక నిరుపేదలు చాలా అల్లాడుతున్నారని అన్నారు. ఎమ్మెల్యే ఆనాడు ప్రజలకు ఉపయోగపడే పనులు కోసం తహతహలాడే వారిని.. అందుకనే రమ్యా గ్రౌండు వద్ద స్కూల్ నిర్మించుకుని దానికి నందమూరి తారక రామారావు పేరు పెట్టేందుకు కూడా అప్పుడు కలెక్టర్ అనుమతి తీసుకున్నారని ఈ వంద పడకల ఆసుపత్రి కూడా పూర్తయితే ప్రజలకు ఎంతో మేలు జరిగేదని అన్నారు. ఎట్టి పరిస్థితుల్లో ఆసుపత్రి నిర్మించి తీరాలని లేనియెడల తమ నిరసన ఉధృతం చేస్తామని కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సురేష్ రెడ్డి, వెంకటరెడ్డి, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళ నాయకులు, కాలనీవాసులు పెద్ద ఎత్తున పాల్గొని నిరసన వ్యక్తం చేశారు.

## టిడిపి మాజీ మంత్రి మా ఆస్తులను కబ్జా చేస్తున్నాడు

**-ఎన్నారై మురళీమోహన్ ఆరోపణ**



కుటుంబసభ్యులతో కలిసి హైద్రాబాద్ ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న మురళీమోహన్

**హైదరాబాద్, జూన్ 3,ప్రభాతవార్త:**

ఏపీ టీడీపీ మాజీ మంత్రి అతని అనుచరులు తన ఆస్తిని కబ్జా చేశారని ఎన్ఆర్ఐ టీడీపీ సెల్ సభ్యుడు రావి మురళీ మోహన్ ఆరోపించారు. హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ..ఏపీలోని చిలకలూరిపేటలో తనకు షాపింగ్ కాంప్లెక్స్ ఉందని తెలిపారు. సదరు కాంప్లెక్స్‌లో రెండు థియేటర్లు, ఫంక్షన్ హాళ్లు, రెండు అంతస్తుల వాణిజ్య సముదాయాలు ఉన్నాయని వాటి విలువ సుమారు రూ.69 కోట్ల ఉంటుందని చెప్పారు. ఉద్యోగరీత్యా తాను 20 సంవత్సరాలుగా అమెరికాలోని ఫ్లోరిడాలో నివాసం ఉంటున్నానని తెలిపారు. గత పది నెలల క్రితం ఏపీకి చెందిన మాజీ మంత్రి టీడీపీ నేత అతని అనుచరులు తన షాపింగ్ కాంప్లెక్స్ మొత్తాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నాని తెలిపారు. తన తండ్రి అంజిబాబు అనే వ్యక్తి వద్ద రూ.97లక్షల రుణం తీసుకున్నాడని ఆరోపిస్తూ తన ఆస్తులను కబ్జాదారులు ఆక్రమించుకున్నారని వాపోయారు. నిజంగానే రుణం తీసుకుంటే తాను మొత్తం చెల్లిస్తానని రుణం పేరుతో తన ఆస్తిని కబ్జా చేస్తున్నారని , వారికి ఆమాజీ మంత్రి సహకారం ఉందిస్తున్నారని ఆరోపించారు.. ఈ విషయంపై అక్కడి పోలీసులకు ఫిర్యాదు చేస్తే కేసు పెట్టడం లేదని, ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చినా పట్టించుకోవడం లేదన్నారు. తన ఆస్తులను కబ్జా చేసిన వ్యక్తులందరూ టీడీపీ పార్టీయే కావడంతో సరైన చర్యలు తీసుకోవడం లేదని వాపోయారు.కావున ప్రభుత్వం స్పందించి తనకు న్యాయం చేయాలని కోరారు.

## మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలం : కిషన్ రెడ్డి


వెంగళరావు నగర్‌లో వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులతో జరిగిన సమావేశంలో పాల్గొన్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి.

**యూసుఫ్‌గూడ, జూన్ 3, ప్రభాతవార్త :**

జూబ్లీహిల్స్ నియోజక వర్గం పరిధిలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు మంగళవారం పర్యటించారు. నియోజక వర్గం పరిధిలోని వెంగళరావు నగర్ కాలనీలో కమ్యూనిటీ హాల్‌ను ఆయన సందర్శించారు. ఈసందర్భంగా కాలనీ అసోసియేషన్ కమిటి సభ్యులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేవలం కమాండ్ కంట్రోల్ చూసుకుని ప్రభుత్వం మురిసి పోతుందని వాస్తవానికి సరియైన మౌళిక సదుపాయాలు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం అయిందని అన్నారు. నగరంలో ఎక్కడ కూడా సరిపడినన్ని సిసికెమెరాలు ఏర్పాటు చేయలేదని అన్నారు. అన్ని హామీలు బస్తీలలో ప్రభుత్వం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి కమాండ్ కంట్రోల్‌కు అను సంధానం చేయాలని అన్నారు. అపుడే చిల్లర దొంగతనాల నుంచి అంతర్జాతీయ టెర్రరిస్టుల వరకు అందరి కదలికలు గమనించవచ్చని పేర్కొన్నారు. అంతే కానీ సిసిలు లేకుండా కమాండ్ కంట్రోల్ ఎందుకు అనీ ప్రశ్నించారు. అదేవిధంగా నగరంలో వీధి దీపాలు ఏర్పాటు అనేది రెండో అతిపెద్ద ప్రధాన సమస్య అనీ సమస్యగా ఉందన్నారు. పూర్తి స్థాయిలో ఎక్కడ కూడా వీధి దీపాలు వెలగడం లేదని నిరంతరం తనకు ఫిర్యాదులు అందుతూనే ఉన్నాయన్నారు. రాష్ట్ర ఆదాయంలో 75శాతం నగరం నుంచే ప్రభుత్వానికి అందుతున్నాయని ఆదాయాన్ని తీసుకోవడవమే తప్ప మౌళిక సదుపాయాలను ప్రజలకు ఈ రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు కల్పించడం లేదని ప్రశ్నించారు. డివిజన్‌లలో రోడ్లు, రిజర్వాయర్ కూడా కావాలని స్థానికులు అడుతున్నారన్నారు. అదేవిధంగా వెంగళరావు నగర్ కాలనీ అయ్యప్ప గ్రౌండ్‌లో కమ్యూనిటీ హాల్ నిర్మాణం అసంపూర్తిగా మిగిలి పోయిందని త్వరలోనే అన్ని సమస్యలను పరిష్కారం చూపుతామని ప్రజలకు హామీ ఇచ్చారు. జిహెచ్ఎమ్‌సి అధికారులు ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపి జిల్లా అధ్యక్షులు లంకల దీపక్‌రెడ్డి, ఉపాధ్యక్షులు కిలారి మనోహర్, వెంగళరావు నగర్ కాలనీ అధ్యక్షులు సిహెచ్ వెంకటేశ్వరావు, కార్యదర్శి పి.శౌరిరాజు, రాజశేఖర్, ఉపాధ్యక్షులు పిహెచ్ఎన్ ప్రసాద్, అర్జున్, జాయింట్ సెక్రటరీ డి.నాగార్జున రెడ్డి, సికింద్రాబాద్ ఆర్‌డీఓ రఘురామ్ శర్మ, ఖైరతాబాద్ ఎమ్మార్వో నయిముద్దీన్, జల మండలి జిఎం హరిశంకర్, సర్కిల్ 19 ఉపకమీషనర్ జకియా సుల్తానా, తదితరుల పాల్గొన్నారు.

**సర్దార్ కుటుంబ సభ్యులను పరామర్శించినకిషన్‌రెడ్డి**

బోరబండలో ఇటీవల స్థానిక కార్పోరేటర్ బాబా ఫసియుద్దీన్ వేదింపులకు తట్టుకోలేక బీఆర్ఎస్ మైనార్టీ సెల్ అధ్యక్షులు సర్దార్ ఆత్మహత్య చేసుకోవడంతో బీజేపి అధ్యక్షులు కొత్త వెంకటేష్ కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్ళగా మంగళవారం మంత్రి స్వయంగా బోరబండలోని మృతుడు సర్దార్ నివాసానికి వెళ్ళి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## రామ్‌గోపాల్‌పేట పోలీస్‌స్టేషన్ భవనాన్ని సందర్శించిన నగర పోలీసు కమిషనర్ సి.వి.ఆనంద్


జేమ్స్ స్ట్రీట్‌లో రాంగోపాల్‌పేట పోలీస్‌స్టేషన్ భవనాన్ని పరిశీలిస్తున్న నగర పోలీసు కమిషనర్ సీ.వీ.ఆనంద్.

**బేగంపేట జూన్ 3,ప్రభాతవార్త**

సికింద్రాబాద్ పరిధి రాంగోపాల్‌పేట జేమ్స్ స్ట్రీట్ లో ఉన్న రాంగోపాల్‌పేట (పాత)పోలీస్‌స్టేషన్ భవనాన్ని హైదరాబాద్ నగర పోలీసు కమీషనర్ సీ.వీ.ఆనంద్ మంగళవారం సందర్శించారు.ఈ సందర్భంగా సీ.వీ.ఆనంద్ మాట్లాడుతూ హైదరాబాద్ మెట్రో పాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) ఆధ్వర్యంలో పురాతనమైన ఈ భవనానికి మరమ్మతులు నిర్వహించి హైదరాబాద్ సిటీ పోలీసులకు తిరిగి అప్పగించారన్నారు.జేమ్స్ స్ట్రీట్ లో ఉన్న ఈ పోలీసు స్టేషన్ 1900సంవత్సరంలో నిర్మించారని,2016వరకు 116సంవత్సరాలు సుదీర్ఘ కాలం పాటు రాంగోపాల్‌పేట పోలీసుస్టేషన్ ఇక్కడి నుంచే సేవలందించిందన్నారు.ఈ భవనానికి మరమ్మతుల అవసరం ఏర్పడటంతో తొమ్మిది సంవత్సరాల క్రితం ఇక్కడ నడుస్తున్న పోలీసు స్టేషన్ ను మినిస్టర్ రోడ్‌లోని అద్దెభవనంలోకి మార్చారన్నారు.తాను సెంట్రల్ జోన్ డీసీపీగా ఉన్న సమయంలో ఈ భవనంలో (ఉన్న పోలీసు స్టేషన్) నుంచే ఎన్నో కార్యక్రమాలు నిర్వహించామని సీపీ ఆనంద్ గుర్తు చేసారు.ఈ భవనానికి చాలా ప్రత్యేకత ఉందన్నారు. కొద్ది రోజుల్లోనే రామ్‌గోపాల్‌పేట పోలీసుస్టేషన్ కు సంబంధించిన వస్తువులను తిరిగి ఈ భవనంలోకి తరలించి హైదరాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు ఆయన తెలియజేసారు.అయితే ప్రస్తుతం పోలీసు స్టేషన్ కు సంబంధించిన వాహనాల సంఖ్య గణనీయంగా పెరిగిందని,వాటి పార్కింగ్ సదుపాయం కోసం ప్రయత్నిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.మన హైదరాబాద్ నగరంలో ఉన్న పురాతనమైన (చారిత్రాత్మక ప్రాముఖ్యత కలిగిన) కట్టడాలను భావితరాల కోసం కాపాడుకోవాలని ఆయన పిలుపు నిచ్చారు.హైదరాబాద్ సిటీ పోలీసుకు సంబంధించిన పురాణి హవేలిలోని కమీషనర్ కార్యాలయానికి గత మూడు సంవత్సరాలుగా మరమ్మతులు జరుగుతున్నాయని,అది కూడా త్వరలో ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉందని కమీషనర్ ఆనంద్ తెలియజేసారు.పురాణీ హవేలిలోని కమీషనర్ కార్యాలయం ప్రారంభించిన తర్వాత ప్రతిశుక్రవారం తాను అక్కడే ఉండి విధులు నిర్వర్తిస్తానని ఆయన వెల్లడించారు.కార్యక్రమంలో నార్త్‌జోన్ డీసీపీ సాధన రష్మీపెరు మాళ్, ట్రాఫిక్ డీసీపీ రాహుల్‌హెగ్డే.ఇతర అధికారులు పాల్గొన్నారు.

## సహకార సంఘం అభ్యున్నతికి పూర్తి సహకారం అందిస్తా : ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

**- రూ.5.లక్షల సొంత డబ్బులు ఇచ్చిన చైర్మన్ రాందాస్ ముదిరాజ్**


హైదర్షాకోట్ సహకార సంఘం కార్యాలయ భవనం ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్.

**నార్సింగి, జూన్ 3 ప్రభాతవార్త :** హైదర్షాకోట్ సహకార సంఘం అభ్యున్నతికి పూర్తి సహకారం అందిస్తానని రాజేంద్ర నగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ పరిధిలో ఉన్న హైదర్షాకోట్ సహకార సంఘ కార్యాలయం అదనపు అంతస్థు ప్రారంభోత్సవ వేడుకలు ఛైర్మన్ బి.రాందాస్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా రంగారెడ్డి జిల్లా సహకార సంఘం చైర్మన్ కొత్తకురుమ సత్తయ్య, ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ హైదర్షాకోట్ సహకార సంఘం చాలా పురాతనమైనదని, ఈ సంఘం ఆర్థిక పరిపుష్టి, అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెడుతామన్నారు. జిల్లా సహకార సంఘం పెద్దలతో మాట్లాడి నిధులు వచ్చేలా కృషి చేస్తానని తెలిపారు. అనంతరం హైదర్షాకోట్ సహకార సంఘం చైర్మన్ బి. రాందాస్ ముదిరాజ్ మాట్లాడుతూ మా సంఘం చాలా వీక్‌గా ఉందని తెలిపారు. సిబ్బంది జీతాలు ఇచ్చేందుకు కూడా ఇబ్బందిగా మారిందన్నారు. సంఘం అభివృద్ధి కోసం నిధులు ఇవ్వాలని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను అడుగుతూనే ఉన్నానని, ఇప్పటి వరకు ఎలాంటి సహకారం అందలేదన్నారు. మున్సిపల్ కమీషనర్‌ను కలిసి అదనపు అంతస్థు నిర్మాణంకు నిధులు ఇవ్వాలని కోరితే ఆ అధికారం మాకు లేదని తిరస్కరించారన్నారు. ఎవరిని అడిగినా నిధులు ఇవ్వలేదని, ఈ సంఘం మూత పడకూడదన్న ఉద్దేశంతో రూ.5.లక్షలు నా సొంత డబ్బులు వెచ్చించాని, జిల్లా సహకార సంఘం నుంచి రూ.3.లక్షలు తీసుకొని రూ.8.లక్షలతో అదనపు అంతస్థు నిర్మించానని వివరించారు. భవనం నుంచి వచ్చే అద్దెలతో అయినా సహకార సంఘంను నడిపించాలన్న సంకల్పంతో ఈ అదనపు అంతస్థును నిర్మించామని చైర్మన్ రాందాస్ ముదిరాజ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేష్ ముదిరాజ్, నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ వేణుగౌడ్, బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ మాజీ మేయర్ బి.మహేందర్‌గౌడ్, మాజీ డిప్యూటీ మేయర్ పి.రాజేందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పి.కృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ నర్సిహ్మారెడ్డి, మాజీ ఎంపిటిసి ఎట్టయ్య ముదిరాజ్, సహకార సంఘం డైరెక్టర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## పద్యనాటకాలు సనాతన ధర్మానికి ప్రతీకలు


రంగస్థలకళాకారులను సత్కరించిన దృశ్యం

**చిక్కడపల్లి, జూన్ 3 ప్రభాతవార్త:**

పద్యనాటకాలు సనాతన ధర్మానికి ప్రతీకలుగా నిలుస్తాయని రసమయి సంస్థ అధినేత, ప్రముఖ కవి డాక్టర్ ఎంకె.రాము అన్నారు. త్యాగరాయ గానసభ సౌజన్యంతో ఆరాధన కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం 16వ పద్యనాటకోత్సవాలు అంగరంగ వైభవోపేతంగా ప్రారంభమయ్యాయి. యువకళావాహిని సంస్థ అధ్యక్షుడు లంకా లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సభలో కనకదుర్గ నృత్యఅకాడమి అధినేత్రి నిర్మల ప్రభాకర్, నిర్వాహక సంస్థ అధినేత లోకం కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా రంగస్థల కళాకారులు ఎం.సాళ్వాచారి, బాబురాజు తీట్ల, సురభి వెంగమాంబ, పరమేశ్‌లను సత్కరించారు. ఈసందర్భంగా టిబిఆర్ క్రియేషన్స్' స్వామియే అయ్యప్ప- పద్యనాటకం' అద్భుతంగా సాగింది. అయ్యప్పగా బి.నారాయణ స్వామి, రాజశేకర పాండ్యులుగా బాబురాజు తీట్ల, మహామంత్రిగా ఎం.సాళ్వాచారి, మహారాణిగా సురభి వెంగమాంబ తమ పాత్రలను అద్భుతంగా నిర్వహించగా హార్మోనియంపై డాక్టర్ నామా చంద్రబాబునాయుడు, ఆహార్యం బి.పరమేశ్వర్ సహకరించారు.

## ప్రమాదవశాత్తు మరణించిన జన సైనికుల కుటుంబాలకి భీమా చెక్కులు అందజేత



చెక్కును అదజేస్తున్న దృశ్యం

**కెపిహెచ్బి కాలనీ, జూన్ 3, ప్రభాతవార్త**

కూకట్‌పల్లిలోని జనసేన పార్టీ కార్యాలయంలో తెలంగాణలో ప్రమాదవశాత్తు మరణించిన నిజామాబాద్ జిల్లా బాన్సువాడ నియోజకవర్గంకు చెందిన కేతావత్ హరి సింగ్, మహబూబ్నగర్ జిల్లా గద్వాల్ నియోజకవర్గానికి చెందిన బొప్పల జమున, నల్గొండ జిల్లా హుజూర్నగర్ నియోజకవర్గకు చెందిన కుర్ర సైదులు జన సైనికుల కుటుంబాలకు జనసేన అధినేత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర ఇంచార్జ్ నేమూరి శంకర్ గౌడ్ , ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్, ఆర్కే సాగర్ చేతుల మీదుగా బాధిత కుటుంబానికి 5 లక్షల చొప్పున బీమా చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా శంకర్ గౌడ్ మాట్లాడుతూ ప్రమాదవశాత్తు మరణించిన జన సైనికుల కుటుంబాలకు ఆసరా ఉండాలన్న ఆలోచనతో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ తీసుకువచ్చిన ఈ బీమా సౌకర్యం ఎంతోమంది జనసేనకుల కుటుంబాలకు భరోసాను కల్పిస్తుందని తెలియజేశారు.కార్యక్రమంలో వీర మహిళ విభాగం కావ్య మండపాక, యడమ రాజేష్, కొల్లా శంకర్, సరి కొప్పుల నాగేశ్వరరావు, సాంబశివుడు, మహబూబ్, శ్రీను ఇతర నియోజకవర్గ నాయకులు జన సైనికులు వీర మహిళలు పాల్గొన్నారు.


కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలో గాజులరామారం డివిజన్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సిసి రోడ్ల గురించి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి జిల్లా బిజెపి కన్వీనర్ మల్లారెడ్డితో కలిసి వినతిపత్రం అందజేసిన బిజెపి నాయకులు గాజులరామారం కార్పొరేటర్ రావుల శేషగిరి

## చెరువుల అభివృద్ధి పనులను పరిశీలించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్


బతుకమ్మ కుంటను పరిశీలిస్తున్న కమిషనర్ ఏవీ రంగనాథ్

**హైదరాబాద్, జూన్3,ప్రభాతవార్త :**

హైడ్రా కమిషనర్ రంగనాథ్ మంగళవారం నగరంలోని పలు ప్రాంతాల్లో జరుగుతున్న చెరువుల అభివృద్ధి పనులని పరిశీలించారు. అంబర్ పేటలోని బతుకమ్మ కుంట అభివృద్ధి పనులను పరిశీలించి స్థానిక ప్రజల సూచనలను అడిగి తెలుసుకున్నారు.బతుకమ్మ కుంటకు ప్రాణం పోసారంటూ స్థానిక ప్రజలు హైడ్రా కమిషనర్ కు కృతజ్ఞతలు చెప్పారు. చెరువులో నీటి బాతులను చూపించి మురిసిపోయారు.అలాగే కుంటలోకి వర్షం నీరు చేరే ఇన్ లెట్.. చెరువు నిండితే నీరు బయటకు వెళ్ళే ఔట్లెట్లను పరిశీలించారు. అలాగే స్థానికుల కోరిక మేరకు కమ్యూనిటీ హాల్ నిర్మాణం ఎక్కడ చేపట్టాలనే విషయాన్ని పరిశీలించి బతుకమ్మ కుంట పక్కన సాగే మురుగు, వరద కాలువ డైవర్షన్ పనులను తనిఖీ చేశారు. హైడ్రా పేరు చెప్పి మూసీ పరీవాహకంలో మట్టి పోస్తున్నారనే ఫిర్యాదులపై స్పందిస్తూ ఇప్పటికే వాళ్లను హెచ్చరించాం వారం రోజుల్లో వారికి వారిగా మట్టిని తీసేస్తామని.. వారం తర్వాత మూసీ పరీవాహకంలో వేసిన మట్టిని తొలగించక పోతే వారిపై కేసులు పెడతాం అని రంగనాథ్ తెలిపారు. అలాగే పాతబస్తీలోని బ్రాహ్మక్‌నుద్దౌలా చెరువు పనులను హైడ్రా కమిషనర్ పరిశీలించారు. యిక్కడ పార్క్ ను కూడా ఏర్పాటు చేయాలని స్థానికులు కోరగా చెరువు అభివృద్ధిలో భాగంగా చెరువు చుట్టూ పాత్ వే అభివృద్ధి చేస్తామన్నారు. ఇక్కడకు రావాలంటే గతంలో భయం వేసేది..మురుగునీటితో నిండిన కుంట వల్ల దోమలు వచ్చేవని యిప్పుడు ఈ పరిసరాలు ఆహ్లాదంగా తయారవుతుంది హైడ్రాకు ధన్యవాదాలు తెలిపారు.

### సాష్ ఈవెంట్‌లో అందాల భామల సందడి

**హైదరాబాద్, జూన్ 3,ప్రభాతవార్త:**

నిన్నటి వరకు మిస్ వరల్డ్ భామలు నగరంలో సందడి చేయగా తాజాగా జూబ్లీహిల్స్ లోని దసపల్ల హోటల్లో మిస్ యూనివర్స్ తెలంగాణ వేదికగా అందాల భామలు హుయలు పోయారు. ఈ నెల 7, 8 తేదీల్లో నగరంలోని ధారా కన్వెన్షన్ హాల్లో నిర్వహించబోయే మిస్ యూనివర్స్ తెలంగాణ ఫైనల్ పోటీల సందర్భంగా దసపల్ల హోటల్లో సన్నాహక కార్యక్రమంలో సాష్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ నుంచి 15 మంది, ఆంధ్రప్రదేశ్ నుంచి 15 మంది అమ్మాయిలను ఎంపిక చేసినట్లు నిర్వాహకురాలు డాక్టర్ సునీత తెలిపారు. జూన్ 7న తెలంగాణ పోటీలు, 8వ తేదీన మిస్ ఆంధ్ర ప్రదేశ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రపంచ ప్రఖ్యాత కొరియోగ్రాఫర్ ఆంటోనీ గుంజాల్వెస్ ప్రసాద్ గారపాటి పాల్గొన్నారు.

### అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

**కంటోన్మెంట్,జూన్ 3 ప్రభాతవార్త:** అనుమానస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చిన్నతోకట్ట అయ్యప్ప సొసైటీలో మహారాష్ట్రకు చెందిన బిహారి పరిక రౌత్ (47), అనే వ్యక్తి నిర్మాణంలో భవనంలోని 2వ అంతస్తు నుంచి పడిపోయాడు. అతని తలకు తీవ్ర గాయాలై మృతి చెందాడు. మృతి చెందిన వ్యక్తి పరిక రౌత్ ప్రమాదవశాత్తూ పడిపోయాడా, ఎవరైనా తోసేసారా అనే వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి బంధువు దినేశ్ బిహార్ రౌత్ ఫిర్యాదు మేరకు పోలీసు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసును ఇన్‌స్పెక్టర్ తిరుపతి రాజు ఆధ్వర్యంలో ఎస్ఐ శివశంకర్ దర్యాప్తు చేస్తున్నారు.


ఖానాపూర్‌లో జరిగిన రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న నార్సింగి సహకార సంఘం చైర్మన్ తోల్‌కట్ట కృష్ణ, పాల్గొన్న గండిపేట మండల తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ అమరేందర్‌రెడ్డి తదితరులు.

## అర్హులైన వారందరికీ కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు

### -ఎమ్మెల్యే ముఠా గోపాల్, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్



షాదీముబారక్, కళ్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, రాజ్యసభ సభ్యులు ఎం.అనిల్‌కుమార్‌యాదవ్, కార్పొరేటర్ ఏ.పావని వినయ్‌కుమార్

**ముషీరాబాద్, జూన్ 3, ప్రభాతవార్త:** అర్హులైన లబ్ధిదారులందరికీ కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు అందిస్తామని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, రాజ్యసభ సభ్యులు ఎం.అనిల్‌కుమార్ యాదవ్‌లు స్పష్టం చేశారు. మంగళవారం లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని ముషీరాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో 97 మందికి షాదీ ముబారక్, 62 మందికి కళ్యాణ లక్ష్మి చెక్కులు, మొత్తం 159 మంది లబ్ధిదారులకు చెక్కులు అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలకు దరఖాస్తు చేసుకున్న వారికి ఎవరికైనా రాకపోతే ఆందోళన చెందవద్దని, త్వరలో మరికొంత మందికి చెక్కులు అందుతాయని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గాంధీనగర్ కార్పొరేటర్ ఏ.పావని వినయ్‌కుమార్, ముషీరాబాద్ తహసీల్దార్ రాణా ప్రతాప్‌సింగ్, మాజీ కార్పొరేటర్ వాజిద్‌హుస్సేన్, స్థానిక బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

## అంబేద్కర్, జగ్జీవన్ రామ్‌ల కొత్త విగ్రహాల ఏర్పాటు



విగ్రహాల ఏర్పాటు ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తదితరులు.

**సికింద్రాబాద్, జూన్ 3 ప్రభాతవార్తః**
సితాఫలమండీ కూడలిలో డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్, జగ్జీవన్ రామ్‌ల కొత్త విగ్రహాలను తన సొంత ఖర్చుతో ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్ అన్నారు. సీతాఫలమండీలో మంగళవారం కార్పొరేటర్లు, అధికారులతో కలిసి విగ్రహాల ఏర్పాటు ప్రదేశాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ త్వరలో కొత్త విగ్రహాలు ఏర్పాటు చేస్తున్నామని, పరిసరాల సుందరీకరణ, పచ్చిక బయళ్ళ ఏర్పాటు తదితర ఏర్పాట్లు జరపాలని పద్మారావు గౌడ్ అధికారులకు సూచించారు. ఎస్.ఈ.ఆశ లత, ఈ ఈ సుబ్రహ్మణ్యం, డీ ఈ ఈ స్వర్ణ లత, ఏఈ కౌశిక్, కార్పొరేటర్లు సామల హేమ, శైలజ, సునీత, ప్రసన్న లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

### -ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



నల్లకుంటలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, చిత్రంలో కార్పొరేటర్ వై.అమృత తదితరులు పాల్గొన్నారు.

**హైదరాబాద్, జూన్ 3 ప్రభాతవార్త**
అంబర్‌పేట నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. అందుకు స్థానిక కాలనీ,బస్తీవాసులు జరుగుతున్న అభివృద్ధి పనులను పర్యవేక్షించాలని సూచించారు.మంగలవారం నల్లకుంట డివిజన్ శంకరమఠం, కూరగాయల మార్కెట్ లైన్‌ల్లో నూతన 3.50 లక్షలతో పైప్‌లైన్ పనులను స్థానిక కార్పొరేటర్ వై. అమృతతో కలిసి ప్రారంభించారు..అనంతరం ఎమ్మెల్యే కాలేరు బస్తీలోని గల్లి గల్లి తిరిగి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు.తమ దృష్టికి వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబర్‌పేట నియోజకవర్గంలో మంజూరైన పనులను దశలవారిగా ప్రారంభిస్తామన్నారు. నల్లకుంట డివిజన్ పరిధిలో న్యూనల్లకుంట,బ్రహ్మణ హాస్టల్, బాయమ్మగల్లి నుంచి తిలక్‌నగర్ రోడ్డు వరకు 1.40కోట్లతో సిసి రోడ్డుకు పనులు ఆమోదం తెలపడం జరిగిందన్నారు. త్వరలో ఈ పనులను ప్రారంభించి నల్లకుంట డివిజన్‌లోని ప్రధాన రోడ్డు మొత్తం సిసి రోడ్డుతో ఆధునీకరిస్తామన్నారు. అభివృద్ధి పనుల్లో అధికారులు నిర్లక్ష్యం వహించొద్దని, ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. సదర్ కాంట్రాక్టర్ నాణ్యత ప్రమాణాలు పాటించి అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి అధికారులు, జిహెచ్ఎంసి అధికారులు, బిఆర్ఎస్, బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## లేబర్‌కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలి




సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వరరెడ్డి

**సైఫాబాద్, జూన్ 3 ప్రభాతవార్త:** ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన కూర్రమైన 4 లేబర్‌కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని ఐఎన్‌టియుసి జాతీయ, రాష్ట్ర నాయకులు డిమాండ్ చేశారు. ఈ 4 లేబర్ కోడ్‌ల వల్ల కార్మికుల చట్టాలకు, ప్రాథమిక హక్కులకు భంగం కలుగుతున్నదని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఐఎన్‌టియుసి జాతీయ సీనియర్ నాయకులు బాబర్‌సలీంపాషా, బి. వెంకటేశ్వరరెడ్డి, జాతీయ కార్యదర్శి ఆర్.డి.చంద్రశేఖర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు వై.నాగన్నగౌడ్, అదిల్‌షరీఫ్, భాస్కర్‌రెడ్డి తదితరులు మాట్లాడారు. మోదీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కొంత మంది నకిలి కాంగ్రెస్ నాయకులు ఐఎన్‌టియుసి ముసుగు వేసుకుని కార్మిక నాయకులుగా చలామణి అవుతున్నారని, కార్మికులను తప్పుదారి పట్టిస్తున్నారని వారు ఆరోపించారు. అంతేకాకుండా వారు ఐఎన్‌టియుసి పేరును దుర్వినియోగం చేస్తున్నారని ఈ ప్రయత్నాలను అపకపోతే తాటతీస్తామని వారు హెచ్చరించారు. సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, రాజ్యసభ మాజీ సభ్యుడు జి.సంజీవరెడ్డి నాయకత్వం వహించే ఐఎన్‌టియుసియే నిజమైనదని వారు స్పష్టం చేశారు.

## ఎప్పటి సమస్యలు అప్పుడే పరిష్కరించాలి : ఎమ్మెల్యే పద్మారావు గౌడ్

**సికింద్రాబాద్, జూన్ 3 ప్రభాతవార్తః**
ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం వహించే పక్షంలో తీవ్ర చర్యలు తప్పవని సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్ అన్నారు. సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ అభివృద్ధి కార్యకలాపాల సమీక్షా సమావేశం మంగళవారం సితాఫలమండీలోని ఎం.ఎల్.ఏ. క్యాంపు కార్యాలయంలో జరిగింది. వర్షా కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బక్రీద్ పర్వ దిన ఏర్పాట్లు, స్కూల్‌లు తెరుస్తున్న నేపధ్యంలో తీసుకోవాల్సిన చర్యలు, టాక్స్, హౌసింగ్ సమస్యలు, ఇతరత్రా అంశాలపై ఈ సమావేశంలో సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు పద్మారావు గౌడ్ మాట్లాడుతూ వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు నిధుల కొరత ఎదురు కావడం శోచనీయమని తెలిపారు. నిధుల కేటాయింపుతో నిమిత్తం లేని అన్ని సమస్యలను వెన్వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. నాలా పుడిక తీసివేతను వెంటనే పూర్తి చేయాలనీ ఆదేశించారు. అన్ని మునిసిపల్ డివిజన్లలో అత్యవసర బృందాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అపాయకరంగా నిలిచిన విద్యుత్ తీగలను వెంటనే తొలగించాలని, వివిధ ప్రదేశాల్లో చెట్ల కొమ్మల వల్ల ఇబ్బందులు తలెత్తకుండా వాటిని తొలగించాలని సూచించారు. అడ్డగుట్ట, లాలాపేట, ఎరుకలబస్తీ ఫంక్షన్ హాల్స్ నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలనీ, స్విమింగ్ పూల్ నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. లాలాపేట లో రోడ్డు విస్తరణను పూర్తి చేసినప్పటికీ స్తంభాల తొలగింపు, ఇతరత్రా పనులు చేపట్టని కారణంగా విస్తరించిన ప్రయోజనం నెరవేరడం లేదని తెలిపారు. చంద్ర బాబు నగర్, పాండవ బస్తీ, శాస్త్రి నగర్, లంబాడి బస్తీ, మంగర్ బస్తీ ప్రాంతాల్లో ప్రభుత్వ ఇళ్ళు శిధిలావస్థకు చేరిన పరిస్థితి ఉన్నప్పటికీ అధికారులు నిర్లక్షంగా వ్యవహరించడం తగదని తెలిపారు. సుభాష్ చంద్ర బోస్ నగర్, దోభీ ఘాట్ లలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళ కేటాయింపు వెంటనే పూర్తి చేయాలనీ, సాయి నగర్ లో నిర్మాణం పనులు వెంటనే పూర్తి చేయాలనీ సూచించారు. రాజీవ్ యువ వికాసం అర్హులైన దరఖాస్తులు పరిష్కరించాలని సూచించారు. మేడి బావి నివాసులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరారు. కొత్త వార్డు కార్యాలయం నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలనీ, ఇందిరానగర్ కమ్యూనిటీ హాల్ పునర్నిర్మాణం, లాలాగూడలోని అంబేద్కర్ కమ్యూనిటీ హాల్‌కు విద్యుత్ సరఫరాకు ఏర్పాట్లు వెంటనే చేపట్టాలని సూచించారు. ఓపెన్ జిమ్‌ల ఏర్పాటు అంశంలో త్వరితగతిన ఏర్పాట్లు జరపాలని, శాస్త్రి నగర్‌లో రుద్ర వీణ సంస్థ అభ్యర్ధనకు అనుగుణంగా కమ్యూనిటీ హాల్, సేవాలాల్ మహారాజ్ భవనం నిర్మాణానికి ఏర్పాట్లు జరపాలని కోరారు. వివిధ ప్రభుత్వ కార్యాలయాల అధికారులు ప్రజలకు అందుబాటులో నిలవాలని పద్మారావు గౌడ్ సూచించారు. వివిధ విభాగాల మధ్య తమ కార్యాలయం ద్వారా నిర్వహించే సమన్వయ వాట్స్ అప్ గ్రూప్‌ల సందేశాలకు వెంటనే స్పందించాలని అధికారులను ఆదేశించారు. డిప్యూటీ కమీషనర్ డీ.సుభాష్‌రావు మాట్లాడుతూ సికింద్రాబాద్ పరిధిలో అభివృద్ధి కార్యకలాపాలు వేగంగా జరుగుతున్నాయని, అన్ని విభాగాల మధ్య సమన్వయ ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు.డిప్యూటీ కమీషనర్ డీ.సుభాష్‌రావు,జీ.హెచ్.ఎం.సీ.కి. చెందిన ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, గిదిదీ, స్పోర్ట్స్, ఎలక్ట్రికల్ వింగ్, హెల్త్ శానిటేషన్, ఎంటమాలజి, హౌసింగ్, హార్టికల్చర్, ప్రాజెక్టుల విభాగాల అధికారులు సుబ్రమణ్యం, వెంకటేష్, రవీందర్, శ్రీనాద్, జీ.ఆర్.కే. రెడ్డి, సువర్ణ, గణేష్, కిష్టయ్య, సంధ్య, లావణ్య, సునీత, హేమలత, డాక్టర్ మారుతీ, కే.రోహిణి, సుదర్శన్, తాసిల్దార్ భీమయ్య గౌడ్, విద్యాధికారి ప్రతాప్ రెడ్డి, విద్యుత్ అధికారి మహేష్, వైద్యాధికారులు డాక్టర్ కే.శ్రీకాంత్, డాక్టర్ వందన, డాక్టర్ జయశ్రీ, రేషనింగ్ అధికారులు పాల్గొన్నారు.




సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్, అధికారులు

## శశిధర్ శిల్పికి శ్రీవిశ్వశిల్పి రామప్ప అవార్డు రావటం అభినందనీయం



శశిధర్ శిల్పిని సత్కరిస్తున్న దాసోజు నాగభూషణాచారి, కే.నవీన్‌రెడ్డి

**ముషీరాబాద్, జూన్ 3, ప్రభాతవార్త:**
శశిధర్ శిల్పికి శ్రీవిశ్వశిల్పి రామప్ప అవార్డు రావటం అభినందనీయమని అంబర్‌పేట్ డివిజన్ బీఎస్పీ మాజీ అధ్యక్షులు, హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు దాసోజు నాగభూషణాచారి కొనియాడారు. మంగళవారం అంబర్‌పేటలోని బ్రహ్మంగారి దేవాలయంలో శశిధర్ శిల్పిని ఆయన రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కే.నవీన్‌రెడ్డితో కలసి శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ సందర్భంగా నాగభూషణాచారి మాట్లాడుతూ శశిధర్ శిల్పి విశ్వబ్రాహ్మణుల సమాజానికి, దేవాలయాలకు చేసిన సేవలను గుర్తించి, తెలంగాణ సాంస్కృతిక శాఖ, తెలంగాణ విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ మాతృ సంఘం ఆధ్వర్యంలో వరంగల్ మాతా భద్రకాళి, బద్రేశ్వరస్వామి కళ్యాణ బ్రహ్మోత్సవాల శుభ సందర్భంలో అవార్డుతో పాటు ప్రశంశా పత్రం అందచేసి ఘనంగా సత్కరించారని తెలిపారు. అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ మాతృ సంఘం గౌరవ అధ్యక్షులు వెంకటాచారి, అధ్యక్షులు వేములవాడ మదన్‌మోమన్‌చారి, ఎమ్మెల్సీ మధుసూదనాచారి, దాసోజు శ్రవణ్ పాల్గొన్నారని వివరించారు.

## సిసి కెమెరాల ఏర్పాటుకు సహకరిస్తా : సంతోష్ యాదవ్



రైల్ నిలయం అంబేద్కర్ నగర్‌లో సీసీ కెమరాలు ఏర్పాటు చేసేందుకు పరిశీలిస్తున్న కాంగ్రెస్ నేత సంతోష్ యాదవ్

**కంటోన్మెంట్,జూన్ 3 ప్రభాతవార్త:** మోండా డివిజన్‌లోని రైల్ నిలయం అంబేద్కర్ నగర్‌లో సీసీటీవి కెమరాలను ఏర్పాటు చేసేందుకు సహాయ సహకారాలు అందిస్తానని సీనియర్ కాంగ్రెస్ నేత చిర్రబోయిన సంతోష్ యాదవ్ తెలిపారు. మంగళవారం ఆయన బస్తీలో పర్యటించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. బస్తీలో అసాంఘీక కార్యక్రమాలు జరగడంతో రాత్రి వేళల్లో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన దృష్టికి తెచ్చారు. స్థానికుల విజ్ఞప్తి మేరకు బస్తీలో సీసీ కెమరాలను ఏర్పాటు చేసేందుకు సహాయ సహకారాలు అందిస్తానని ఆయన తెలిపారు. వాటి కోసం సీసీ కెమరాల టెక్నిషియన్‌తో సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు నాగేశ్ యాదవ్, బాబురావ్ తదితరులు పాల్గొన్నారు.

## సిఈఓ ఉన్నత పదవులు అధిరోహించాలి : జె.ఎం.ఆర్.



కంటోన్మెంట్ బోర్డు సిఈఓ మధుకర్ నాయక్‌కు అభినందనలు తెలుపుతున్న మాజీ వి.పి.మహేశ్వర్‌రెడ్డి, మాజీ బోర్డు సభ్యులు

**కంటోన్మెంట్,జూన్ 3 ప్రభాతవార్త:** ఎసికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు సిఈఓ మధుకర్ నాయక్ ఉన్నత పదవులు అధిరోహించి సమాజ అభివృద్ధి కోసం పాటుపడాలని బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం సిఈఓను మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ బోర్డు సభ్యులు పాండు యాదవ్, లోకనాథం, నళిని కిరణ్, అనిత ప్రభాకర్ పాల్గొన్నారు.

## లాలాపేటలో ముక్తి భారత్ అభియాన్ స్క్రీనింగ్

**అడ్డగుట్ట, జూన్ 3 ప్రభాతవార్తః** ముక్తి భారత్ అభియాన్ స్క్రీనింగ్ క్యాంప్‌ను ప్రారంభించారు. లాలాపేట్, సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఈ క్యాంప్‌ను లాలాపేట్‌లో జరిపారు. ఈ క్యాంప్ వంద రోజుల పాటు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. మురికివాడలు, వృద్ధాశ్రమాలు, నైట్ షెల్టర్‌లలో నిర్వహిస్తారని తెలిపారు. రెండు రోజులకు మించి దగ్గు, సాయంత్రం జ్వరం, బరువు తగ్గడం తదితర లక్షణాలు ఉన్నవారు ఈ క్యాంపులో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పిహెచ్ఓ డా.జయశ్రీ, డా, సరిత ఇతర అధికారులు పాల్గొన్నారు.

## రొమ్ము క్యాన్సర్ పరీక్షా పరికరాన్ని ప్రారంభించిన ఎంపి ఈటల



క్యాన్సర్ పరీక్షా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపి,ఎమ్మెల్యే

**అల్వాల్, జూన్ 3 ప్రభాతవార్త:**
రేడియేషన్ లేకుండా రొమ్ము క్యాన్సర్‌ను పరిక్ష చేసే యంత్రాన్ని ఓల్డ్ అల్వాల్‌లోని ప్రభుత్వ ప్రాథమిక కేంద్రంలో మంళవారం ఎంపి ఈటెల రాజేంద్రర్ ప్రారంభించారు. మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి స్థానిక కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి విశిష్ట అతిథులుగా హాజరయ్యారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్ సర్వీసు నిధులతో మహిత స్వచ్ఛంద సంస్థ సహకారంతో పరీక్ష పరికరాలను ఏర్పాటు చేయడం జరిగింది. రొమ్ము, కార్వికల్ క్యాన్సర్‌లను తెలుసుకునే అత్యాధునిక స్క్రీనింగ్ ఇనిషియేటివ్ మిషన్ తెలంగాణా దయాగ్రిస్టిక్స్ మినీ హబ్‌గా ఇది నిలవనున్నది. భారతదేశంలోనే మోదటి సారిగా అల్వాల్ ప్రాధమిక ఆరోగ్య కేంద్రంలో కొలువు తీరడం విశేషం. ఈ కార్యక్రమంలో మెడ్చెల్ మల్కాజిగిరి డిఎంహెచ్ఓ డాక్టర్ ఉమ గౌరి, డిప్యూటీ డాక్టర్ శోభ, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ సీజీఎం బద్రీనాథ్ మహిత డైరెక్టర్ రమేష్ శేఖర్ రెడ్డిలుతో పాటుగా పలువురు పాల్గొన్నారు.

## సిసి రోడ్డు పనులు ప్రారంభం



పనులు ప్రారంభోత్సవంలో కార్పొరేటర్‌తో పాటుగా ఎమ్మెల్యే

**అల్వాల్, జూన్ 3 ప్రభాతవార్త:** ప్రజావసరాలు మేరకు అభివృద్ధిని కొనసాగిస్తున్నామని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం వెంకటాపురంలో 14లక్షలు వ్యయంతో ఏర్పాటు చేయనున్న సిసి రోడ్డు పనులను ఎమ్మెల్యే స్థానిక కార్పొరేటర్ సబిత అనీల్ కిషోర్‌లు సంయుక్తంగా ప్రారంభించారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడం ప్రజా ప్రతినిధులు బాధ్యతని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా ముందుకు సాగిన సందర్భంలోనే అనుకున్న లక్ష్యాలు సాధించగలుగుతామని తెలిపారు. అభివృద్ధికి ప్రజల సహకారం అవసరమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు డోలి రమేష్, అనీల్ కిషోర్,మోసిన్,ప్రభాకం పాల్గొన్నారు.

## నకిలీ వైద్యుడి అరెస్ట్

**బేగంపేట జూన్ 3,ప్రభాతవార్త**
అవసరమైన చదువు (విద్యార్హత) లేకుండా తెల్లకోటు మెడలో స్టెతస్కోప్ వేసుకుని డాక్టర్‌గా చెలామణి అవుతూ అమాయక ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న నకిలీ వైద్యుడిని బేగంపేట పోలీసులు అరెస్ట్ చేసారు.సబ్ ఇన్స్‌పెక్టర్ ఆర్.జయచందర్ తెలియజేసిన కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.బేగంపేట పోలీసుస్టేషన్ పరిధిలోని అన్నానగర్‌లో ఓ నకిలీ వైద్యుడు ఆసుపత్రి నిర్వహిస్తున్నాడనే విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్సై వరలక్ష్మి నేతృత్వంలో పోలీసు సిబ్బంది కలిసి సోమవారం ఉదయం ఆకస్మికంగా నకిలీ వైద్యుడు నడుపుతున్న క్లినిక్‌పై దాడి చేసారు.అన్నా నగర్‌లో జి.మహేందర్(48) అనే వ్యక్తి క్లినిక్ నడుపుతున్నట్లు గుర్తించారు.అతని వద్ద విద్యార్హతకు సంబంధించి ఎలాంటి పత్రాలు లేకపోగా నిజమైన వైద్యుడి లాగానే తెల్లకోటు మెడలో స్టెతస్కోప్ ధరించడంతో పాటు ఆసుపత్రిలో బీపీ చెక్ చేసే పరికరం,ధర్మామీటర్,మందులు రాసే ,చీటీల పుస్తకం,మధుమేహ పరిక్షా పరికరం,పల్స్ ఆక్సో మీటర్,ఇతర మందులను క్లినిక్‌లో పోలీసులు గుర్తించారు.మేడ్చల్ మల్కాజ్‌గిరి ఓల్డ్‌సఫిల్ గూడాకు చెందిన మహేందర్ ఎలాంటి విద్యార్హతలు.సరైన పత్రాలు లేకున్నా చుట్టు పక్కల ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలకు వైద్యం చేస్తూ మందులను రాసిస్తున్నాడు.దీంతో తనిఖీలు నిర్వహించిన అనంతరం నిందితుడిని అరెస్ట్ చేసి క్లినిక్ లో ఉన్న వైద్య పరికరాలు,ఔషదాలను స్వాధీనం చేసుకున్నారు.కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## శేరిలింగంపల్లి జర్నలిస్టుల ఇళ్లస్థలం ఫెన్సింగ్‌ను కూల్చివేసిన కబ్జాదారులు

**-స్థలం మధ్యలో నుంచి విద్యుత్ లైన్ స్తంబాల ఏర్పాటుకు యత్నం**
**-శేరిలింగంపల్లి ఎమ్మెల్యే,చందానగర్ డిప్యూటి కమిషనర్లకు ఫిర్యాదు**
**-ఫెన్సింగ్ కూల్చివేతపై క్రిమినల్ కేసు నమోదుకు డిప్యూటి కమిషనర్ ఆదేశం**



జర్నలిస్టులకు కేటాయించిన స్థలంలో ఖడీలు తొలగించిన కబ్జాదారులు



ఇళ్ల స్థలాల ఫెన్సింగ్ కూల్చిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గాంధీకి వినతిపత్రాన్ని అందిస్తున్న జర్నలిస్టులు

**శేరిలింగంపల్లి, జూన్ 3 ప్రభాతవార్త :**
శేరిలింగంపల్లి జర్నలిస్టుల ఇళ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం చందానగర్‌లో కేటాయించిన భూమిలోనికి అక్రమంగా ప్రవేశించిన కబ్జాదారులు స్థలం చుట్టూ రక్షణ కోసం ఏర్పాటు చేసిన ఫెన్సింగ్‌ను తొలగించారు. స్థలం మధ్యలో నుంచి విద్యుత్ లైన్ ఏర్పాటు కోసం విద్యుత్ శాఖ అధికారులు స్తంబాల నిర్మాణ పనులు చేపట్టగా, సమాచారం అందుకున్న శేరిలింగంపల్లి జర్నలిస్టులు పనులను అడ్డుకుని విషయాన్ని మంగళవారం శేరిలింగంపల్లి నియోజక వర్గ ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ దృష్టికి తీసుకెళ్లారు. ఫెన్సింగ్ కూల్చివేతపై ఎమ్మెల్యే గాంధీ, చందానగర్ డిప్యూటి కమిషనర్,చందానగర్ కార్పొరేటర్ ఫిర్యాదు చేశారు. శేరిలింగంపల్లి మండల పరిధిలో పనిచేస్తున్న జర్నలిస్టుల ఇళ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం చందానగర్ లోనిసర్వేనంబర్ 174లో 1ఎకరా స్థలాన్ని గతంలోనే కేటాయించిన విషయం విదితమే. రెవెన్యూ అధికారులు హద్దులు నిర్ణయించి, పొజిషన్ హ్యాండ్ ఓవర్ చేసిన ఈ స్థలం చుట్టూ జర్నలిస్టులు ఖడీలు ఏర్పాటు చేసి రక్షణ కోసం ఫెన్సింగ్ వేశారు. సోమవారం కొంతమంది కబ్జాదారులు ఫెన్సింగ్ కూల్చివేసి జర్నలిస్టుల ఇళ్ల స్థలంలోనికి అక్రమంగా ప్రవేశించారు. దీంతోపాటు ఈ స్థలానికి పక్కనే ఉన్న ప్రైవేటు స్థలంలో ఉన్న విద్యుత్ లైన్‌ను మార్చి , జర్నలిస్టుల ఇళ్ల స్థలం మధ్యలో నుంచి స్తంబాలను ఏర్పాటు చేసేందుకు విద్యుత్ శాఖ అధికారులు పనులు చేపట్టారు. విషయం తెలుసుకున్న జర్నలిస్టులు విద్యుత్ శాఖ అధికారుల పనులను అడ్డుకుని మంగళవారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ దృష్టికి విషయాన్ని తీసుకువెళ్లారు. ఫెన్సింగ్ కూల్చివేతలపై ఎమ్మెల్యే గాంధీకి ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులకు ఫోన్ చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ అధికారుల పనితీరుపై జర్నలిస్టులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పక్క స్థలంలో ఉన్న విద్యుత్ లైన్‌ను మార్చి తమ స్థలంలో స్తంబాలు ఏర్పాటు చేయటం చట్టవిరుద్ధమని ఏడీఈని ప్రశ్నించారు. దీంతో తప్పు తెలుసుకున్న విద్యుత్ శాఖ అధికారులు నాటిన స్తంబాలను తొలగించటంతో పాటు పనులు చేపట్టిన కాంట్రాక్టర్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఫెన్సింగ్ కూల్చివేతపై శేరిలింగంపలిల జర్నలిస్టులు చందానగర్ సర్కిల్ డిప్యూటి కమిషనర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన డిప్యూటి కమిషనర్ ఫెన్సింగ్ కూల్చివేసిన వారిపై చట్టప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేయాలని చందానగర్ పోలీసులకు వ్రాత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టు యూనియన్ నాయకులు, శేరిలింగంపల్లి ప్రెస్‌క్లబ్,టెంజు కార్యవర్గ సభ్యులు, శేరిలింగంపల్లి జర్నలిస్టులు పాల్గొన్నారు.

## శతజయంతి సాహితీమూర్తులు విమర్శనారామం గ్రంథాల ఆవిష్కరణ

**నాంపల్లి, జూన్ 3 ప్రభాతవార్త :** ఉత్తమ సాహిత్య విమర్శకుడు, ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగుశాఖ సీనియర్ ఆచార్యుడు, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్, డీన్ ఫాకల్టీ ఆఫ్ ఆర్ట్స్ వంటి వివిధ అత్తున్నత హోదాల్లో విధులు నిర్వహించడమే కాకుండా పలు విమర్శ గ్రంథకర్త, తెలుగుభాషా చరిత్ర గ్రంథకర్తగా చిరపరిచితులైన బహుముఖ ప్రజ్ఞాశాలి ఆచార్య ఎస్.వి.రామారావు 85వ జన్మదినాన్ని పురస్కరించుకొని ఈ నెల 6 శుక్రవారం ఉదయం 10నుండి సాయంత్రం 4గంటల వరకు నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్ వద్దనున్న సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలోని డా. నందమూరి తారక రామారావు కళావేదికలో శతజయంతి సాహితీమూర్తులు, విమర్శనారామం ఆచార్య ఎస్వీ రామారావు సమగ్ర సాహిత్య సమాలోచన గ్రంథాల ఆవిష్కరణ తదితర కార్యక్రమాలు నిర్వహించబడుతాయని దత్తాత్రేయ శర్మ, డా. లలితావాణి, సాధన నరసింహాచార్య, డా. ఆచార్య ఫణీంద్రలు మీడియాతో మాట్లాడుతూ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేయనున్న శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం పూర్వ ఉపాధ్యక్షుడు, పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్ శతజయంతి (సాహితీమూర్తులు); సభాధ్యక్షుడు దూరదర్శన్ మాజీ సంచాలకుడు డా. ఆర్. అనంతపద్మనాభరావు విమర్శనారామం (ఆచార్య ఎస్వీ రామారావు–సమగ్ర సాహిత్య సమాలోచన) గ్రంథాలను ఆవిష్కరిస్తారని, విశిష్ట అతిథులు సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావు, సురేష్‌చంద్రశర్మ, ఆచార్య సాగి కమలాకరశర్మ తదితరులు పాల్గొంటారని, డా. ఆచార్య ఫణీంద్ర శతజయంతి; ఆచార్య టి.గౌరీశంకర్ విమర్శనారామం గ్రంథాల సమీక్ష కావిస్తారని వారు వివరించారు. చివరిగా 30మంది ప్రముఖ సాహిత్య, సాంస్కృతిక సంస్థల సారథులకు ఆత్మీయసత్కారం జరుగుతుందని, సభకుముందు గోలకొండ సాహితీ వైభవం సాహిత్యరూపకం ప్రదర్శింపబడుతుందని వారు వివరించారు. అధికసంఖ్యలో సాహితీమూర్తులు, ఔత్సాహిక ప్రేక్షకులు విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## గవర్నర్ చేతులపై బంగారు పతకాలు అందుకున్న ఎంజిఐటి విద్యార్థులు




జెఎన్‌టియు స్నాతకోత్సవంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా బంగారు పతకాలు అందుకుంటున్న ఎంజిఐటి విద్యార్థుల దృశ్యం.

**నార్సింగి, జూన్ 3 ప్రభాతవార్త :** గండిపేటలోని ఎంజిఐటి కళాశాలకు చెందిన 5.గురు విద్యార్థులు రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా బంగారు పతకాలు అందుకున్నారు. మంగళవారం జెఎన్‌టియుహెచ్ స్నాతకోత్సవ వేడుకలలో బంగారు పతకాలు అందుకున్న ఐదుగురు విద్యార్థులను ఎంజిఐటి కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్, ప్రొఫెసర్లు అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు. బిటెక్ సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో ఉత్తమ ఔట్‌గోయింగ్ విద్యార్థినిగా పన్నీటి శ్రీజ, మెకానికల్ ఇంజనీరింగ్(మెకాట్రానిక్స్) విభాగంకు చెందిన గొట్టిపర్తి అభి నయ్, మెటలర్జికల్ అండ్ మెటీరియల్స్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన మెడ గం నిఖితారెడ్డి, కంప్యూటర్ సైన్స్ అండ్ బిజినెస్ సిస్టమ్స్ విభాగానికి చెందిన కేజసాయి భారతి, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్(డేటా సైన్స్) విభాగానికి చెందిన ఆయేషాఖానంలు గవర్నర్ చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు.

## శానిటేషన్ డ్రైవ్ ప్రారంభం



**అడ్డగుట్ట, జూన్ 3 ప్రభాతవార్తః**
అడ్డగుట్టలో శానిటేషన్ డ్రైవ్ కార్యక్రమాన్ని స్థానిక కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మీ మంగళవారం జిహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్ సుభాష్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ శానిటేషన్ డ్రైవ్ కార్యక్రమం అడ్డగుట్టలో మూడు రోజుల పాటు జరుగుతుందని, పరిసరాల పరిశుభ్రతే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని ఆమె తెలిపారు. పరిసరాల పరిశుభ్రతలో ప్రజల భాగస్వామ్యం కూడా అవసరమని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు లింగాని శ్రీనివాస్, మోహన్ ,శ్రీశైలం,కుమార్ శానిటేషన్,నిని వెంకటేష్ రాంకీ ఏఈ దశరథ్, సిబ్బంది, ఎస్ఎఫ్ఏలు పాల్గొన్నారు.

## ప్రముఖ రంగస్థలనటులు నాగేందర్‌కు అభినందన సత్కారం



నాగేందర్‌కు జ్ఞాపికను బహుకరిస్తున్న త్రినాథరావు తదితరులు

**చిక్కడపల్లి, జూన్ 3 ప్రభాతవార్త:** చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో బానోదయ మ్యూజికల్స్ ఆధ్వర్యంలో మంగళవారం తెలుగు, హిందీ సినీ సంగీత విభావరి కార్యనరకమం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభలో ప్రముఖ రంగస్థలనటులు నాగేందర్‌కు అభినందన సత్కారకార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా అంతర్జాతీయ గాయకుడు చింతలపూడిత్రినాథరావు హాజరై సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సినీ సంగీత విభావరి అందరిని అలరించింది. కార్యక్రమంలో కళారథకుడు సన్నిధానం భానుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## బోయిన్‌పల్లి పంప్‌హౌజ్ మరమ్మతు పనులు పర్యవేక్షించిన మహేశ్వర్‌రెడ్డి



**కంటోన్మెంట్,జూన్ 3 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ 1వ వార్డు బోయిన్‌పల్లిలోని మంచినీటి పంప్‌హౌజ్ మరమ్మత్తులను మంగళవారం కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో 1వ వార్డుకు చెందిన బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

**PUBLIC NOTICE**
Please be informed one and all!
It has come to the knowledge of my Clientess, Mrs. Kavita Panyam, a Counseling Psychologist, that her husband, Mr. Panyam Dinesh, had allegedly caused loss to several people by indulging in algorithmic trading in the stock market for and on behalf of them.
My Clientess says with full authority that whatever transactions were carried out by her husband were wholly and solely done by him and him alone. Neither my Clienless nor her children are in no way directly or indirectly concerned with any of the monetary transactions entered into by my Client's husband causing loss of money if any.
It is therefore notified herewith that neither my Clientess nor her children should be harassed in this regard whatsoever.
The affected people are free to initiate any legal action against her husband if they deem necessary.
N.B. Sudarshan, Advocate,
Date: 03.06.2025 Mobile No. 9989822624

వార్త VAARTHA CLASSIFIEDS

**LOST**
★ I, PRASAD V CHATURVEDULA S/o Late PRABHAKAR CHATURVEDULA R/o Plot No. 1-1-461 to 465, Flat No. 302, Sravanthi Apt., Gandhi Nagar, Hyd. I have Lost my Land Doc No.1207/1957, while travelling from RTC X Road to Golconda X Roads, Hyd. If anybody found pls. Cont: 7702186346.

**గమనిక**
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ - L.B. నగర్, సర్కిల్-4 GHMC
నిట్ నం.07/EEC-4/LBNR/GHMC/2025-26, తేది: 03.06.2025
పని పేరు: నిర్వహణ పనులు–2 నం.లు. అంచనా మొత్తం: రూ.52.00 లక్షలు. బిడ్స్ స్వీకరణకు ప్రారంభ/చివరి తేదీ, సమయం: 04.06.2025 మ.03.00 గం. 11.06.2025 మ.03.00 గం. అధికారి పేరు, చిరునామా, సెల్ నం.: శ్రీ వి. కార్తీక్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, L.B. నగర్ సర్కిల్-4, GHMC, (M): 9701365519. తదుపరి వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ https://tender.telangana.gov.in వద్ద చూడవచ్చును.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, L.B. నగర్ సర్కిల్-4, GHMC
DIPR.No.3004-PP/CL/Advt/1/2025-26, తేది: 03.06.2025

## బోడుప్పల్లో ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ



బోడుప్పల్లో ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ చేస్తున్న కమిషనర్ శైలజ , మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ , మాజీ కార్పొరేటర్ బొమ్మక్ కళ్యాణ్ , తదితరులు

**బోడుప్పల్ , జూన్ 3 ప్రభాతవార్త ;**
బోడుప్పల్ నగరపాలక సంస్థలో ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను కమిషనర్ శైలజ , మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, మాజీ డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిషోర్ గౌడ్ తో కలిసి లబ్ధిదారులకు అందజేసినార్రు ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు గుర్రాల రమా వెంకటేశ్ యాదవ్ ,బొమ్మక్ కళ్యాణ్ కుమార్ ,కొత్త చందర్ గౌడ్ , దానగల్ల అనిత యాదగిరి , సీసా వెంకటేష్ గౌడ్ , భూక్య సుమన్ నాయక్ ,చీరాల నరసింహ నాయకులు మోదుగు శేఖర్ రెడ్డి , పోగుల వీరారెడ్డి , ఫకీర్ హరినాథ్ రెడ్డి , మున్సిపల్ అధికారులు , ఇందిరమ్మ ఇళ్ల పట్టాదారులు తదితరులు పాల్గొన్నారు

## వేగవంతంగా అభివృద్ధి పనులు : కార్పొరేటర్ భాగ్యలక్ష్మీ



రోడ్డు నిర్మాణం పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీ తదితరులు

**మలక్ పేట ,జూన్ 3, ప్రభాతవార్త:** వేగవంతంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ముసారంబాగ్ డివిజన్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీ పేర్కొన్నారు. డివిజన్ లోని గడ్డి అన్నారం లో రూ. 30 లక్షలతో నిర్మించనున్న రోడ్డు నిర్మాణం పనులను ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోడ్డు నిర్మాణం పనులలో నాణ్యత ప్రమాణాలను పాటించాలని అధికారులను ఆదేశించారు. స్థానిక ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా రోడ్డు నిర్మాణం పనులను త్వరగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. డివిజన్ ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడమే తమ ధ్యేయమని తెలిపారు. బస్తీలలో అన్ని రోడ్లను నూతనంగా నిర్మించడానికి చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు కొప్పుల దినేష్, నాయకులు యాదగిరి సురేందర్, నాయకులు యాదగిరి సురేందర్, ప్రభాకర్, శ్రీధర్ గౌడ్, బ్రహ్మాచారి, శ్రీకాంత్, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

## 29న ఉచిత ఆయుర్వేద మెగా వైద్య శిబిరం



ఉచిత ఆయుర్వేద మెగా క్యాంప్ కు సంబంధించి బ్రోచర్ ను విడుదల చేస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి, నిర్వాహకులు.

**వనస్థలిపురం. జూన్.3.ప్రభాతవార్త :** హైదరాబాద్ లోని ఓషది హెల్త్ సర్వీసెస్ వనస్థలిపురం, మానవ వైద్య అండ్ మర్రియన్ హెల్త్ సైన్సెస్ హరిద్వార్ తో కలిసి జూన్ 29 న వనస్థలిపురం సచివాలయనగర్ లోగల ఓషది ప్రాంగణంలో ఉచిత మెగా హెల్త్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శ్రీకాంత్ నాంపల్లి, భాను ప్రతాప్,గోపాల్ రెడ్డి లు తెలిపారు. ఈ శిబిరంలో నిపుణులైన ఆయుర్వేద వైద్యుల చే నాన్‌హీలింగ్ అల్సర్స్, డయాబెటిక్ ఫుట్ అల్సర్స్, బెడ్ సోర్స్,ఫైల్స్,అనల్ ఫిషర్,పిస్తుల్లా తదితర దీర్ఘకాలిక వ్యాధులకు పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేయబడతాయన్నారు. ఈ శిబిరంలో పద్మశ్రీ ప్రొఫెసర్ మనోరంజన్ సాహు, ప్రొఫెసర్ ప్రలే మైతి లు 15 సంవత్సరాలకు పైగా చేసిన అత్యధునిక పరిశోధన ఫలితంగా కనుగొన్న సూపర్ హీల్ యొక్క ప్రాధాన్యత ను భానుప్రతాప్ వివరించారు. గాయాల సంరక్షణ లో సూపర్ హీల్ ఒక పురోగతి అన్నారు.అధునాతన మైన గాయాల సంరక్షణకు సూపర్ హీల్ పరిష్కారం చూపిస్తుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం మెగా క్యాంప్ కు సంబంధించిన బ్రోచర్ ను స్థానిక కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి నిర్వాహకుల తో కలిసి ఆవిష్కరించారు.

## ఏ.టైప్ క్వార్టర్స్,పోచమ్మ ఆలయ అధ్యక్షులకు సన్మానం



నూతనంగా ఎన్నికైన కాలనీ,ఆలయ అధ్యక్షులను సన్మానిస్తున్న చింతల రవికుమార్.

**వనస్థలిపురం. జూన్.3.ప్రభాతవార్త :** వనస్థలిపురం డివిజన్ లో గల ఏ.టైప్ క్వార్టర్స్, శ్రీ పోచమ్మ ఆలయానికి నూతనంగా ఎన్నికైన గాండ్ల ఆనంద్ రాజ్,శ్రీనివాసరావు, సతీష్ కుమార్, సత్యనారాయణ లను వనస్థలిపురం డివిజన్ బి.ఆర్.ఎస్. అధ్యక్షుడు చింతల రవికుమార్ గుప్త మంగళవారం ఆలయంలో కలిసి శాలువాతో సత్కరించి,అభినందనలు తెలిపారు.

## మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావుతో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి బేటి



హరీష్‌రావును సత్కరిస్తున్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు

**ఉప్పల్, జూన్ 3 ప్రభాతవార్త :** మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావుతో మంగళవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి బేటి అయ్యారు. ఉప్పల్‌కు చెందిన పలువురు బిఆర్ఎస్ పార్టీ నేతలతో కలిసి హరీష్‌రావును కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు రాష్ట్రానికి చేసిన సేవలు మరువలేనివన్నారు. తెలంగాణలో ప్రాజెక్టుల నిర్మాణానికి ఆయన ఎంతో కృషి చేశారని కొనియాడారు. హరీష్‌రావు జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నేతలు బన్నాల ప్రవీణ్, ఆకుల మహేందర్, జెట్ట కిషోర్, సర్వబాబుయాదవ్, బి.నిరంజన్‌చారి, కొండల్‌రెడ్డి, కె.జగన్, బోసాని పవన్‌కుమార్, బాలు, శ్యామ్, కడిగె శేఖర్, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

## బాలాపూర్ బీరప్ప ఆలయాన్ని సందర్శించిన సబితా ఇంద్రారెడ్డి

**సరూర్‌నగర్, జూన్ 3 ప్రభాతవార్త:**
మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని బాలాపూర్‌లోనున్న బీరప్ప స్వామి ఆలయాన్ని మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే పట్లోళ్ళ సబితా ఇంద్రారెడ్డి సందర్శించారు. బీరప్ప దేవాలయ కమిటీ, గ్రామ కురుమల ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా భక్తిశ్రద్ధలతో సాంప్రదాయ బద్ధంగా నిర్వహిస్తున్న శ్రీ బీరప్పస్వామి, కామరాతిదేవిల కళ్యాణోత్సవాలను పురస్కరించుకొని ఆమె సోమవారం సాయంత్రం ఆలయానికి వచ్చారు. అనంతరం ఆమె కామరాతిదేవి సమేతుడైన బీరప్ప స్వామిని దర్శించుకొని పూజలు చేశారు. ఆ తర్వాత ఉత్సవ నిర్వాహకులు ఆమెను సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో వంగేటి లక్ష్మీ లక్ష్మారెడ్డి, గుండోజు రఘునందనచారి, కళ్ళెం ఎల్లారెడ్డి, చిగిరింత పెద్ద నర్సింహారెడ్డి, జూకంటి సురేష్‌గౌడ్, తిమ్మని గిరీష్, కొప్పుల రాజు, అరవింద్‌గౌడ్, ముప్పిడి ధన్‌రాజ్‌గౌడ్, జెట్ట పాండు, రితున్‌రెడ్డి, అశ్విన్‌రెడ్డి,



బీరప్ప జాతర సందర్భంగా బాలాపూర్ కురుమ కుటుంబాలతో సబితా ఇంద్రారెడ్డి: పక్కన వంగేటి లక్ష్మీ లక్ష్మారెడ్డి

కురుమ సంఘం నాయకులు ఇక్కె సత్యనారాయణ, ఇక్కె కొండల్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గ నాయకుడు క్యామ మల్లేష్ కూడా ఉత్సవాలకు హాజరై బీరప్ప స్వామిని దర్శించుకున్నారు.

## రక్తదానం ప్రాణదానంతో సమానం : ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**రామంతాపూర్, జూన్ 3 ప్రభాతవార్త :**
రక్తదానం ప్రాణదానంతో సమానమని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు జన్మదినం సందర్భంగా రామంతాపూర్ వెంకట్‌రెడ్డినగర్‌లో పార్టీ సీనియర్ నేత కాలేరు జైనవీన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డితోపాటు, మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, దేవేందర్‌రెడ్డి, డి.బాలరాజుయాదవ్, గోలి శ్రీనివాస్‌రెడ్డి, మల్కాజిగిరి పార్లమెంట్ ఇంచార్జీ రాగిడి లక్ష్మారెడ్డి పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ రక్తదానం కొరత వల్ల అనేక మంది ఇబ్బంది పడుతున్నారని, ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరు ఏడాదిలో రెండుసార్లు రక్తదానం చేయవచ్చని తెలిపారు. రక్తదానంతో ఎంతో మందికి కొత్త జీవితం ఇచ్చిన వారు అవుతారని తెలిపారు. మాజీ మంత్రి హరీష్‌రావు సేవలు అభినందనీయమన్నారు. ఉప్పల్ నియోజకవర్గం అభివృద్ధికి ఆయన ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. పలు



వెంకట్‌రెడ్డినగర్‌లో జరిగిన రక్తదాన శిబిరంలో పాల్గొన్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, రాగిడి లక్ష్మారెడ్డి తదితరులు

వురు యువకులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నేతలు డా.బి.వి.చారి, గంధం నాగేశ్వర్‌రావు, పిల్లి నాగరాజు, సోమిరెడ్డి, గుడి మధుసూధన్‌రెడ్డి, ఈరెల్లి రవీందర్‌రెడ్డి, పల్లె నర్సింగ్‌రావు, రెహమాన్, షేక్ అబ్బూ, బాబా, యాదమ్మ, నరేందర్‌రాజు, రాజ్యలక్ష్మి, దినేష్, ఖదీర్,పాశుబాయ్, హరీష్ పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ బీరప్ప స్వామి కామరాతిదేవిల కళ్యాణ మహోత్సవం

**సరూర్‌నగర్, జూన్ 3 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బాలాపూర్‌లో శ్రీ బీరప్ప స్వామి కామరాతిదేవిల కళ్యాణ మహోత్సవం కనుల పండువగా జరిగింది. బీరప్ప స్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉత్సవాలను కురుమలు సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలేరు నియోజకవర్గ ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఉత్సవాలకు హాజరై పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, మాజీ కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

**హాజరైన పలువురు ప్రముఖులు**

బీరప్ప, కామరాతిదేవిల కళ్యాణం సందర్భంగా మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, నియోజకవర్గ బిజెపి ఇంఛార్జి అందెల శ్రీరాములు యాదవ్, బిజెపి జాతీయ నాయకుడు పేరాల శేఖర్‌జీ, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, సింగిల్ విండో మాజీ ఛైర్మన్ కొలన్ శంకర్‌రెడ్డి, చెరుకుపల్లి



కళ్యాణోత్సవానికి హాజరైన ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య: చిత్రంలో మాజీ మేయర్ పారిజాత తదితరులు

వెంకట్‌రెడ్డిలతో పాటు పలువురు హాజరై బీరప్ప స్వామిని దర్శించుకొని పూజలు చేశారు. ఉత్సవాలకు హాజరైన నాయకులకు ఉత్సవ నిర్వాహకులు శాలువాలతో సన్మానించి జ్ఞాపికలను అందజేశారు.

## పరిసరాల పరిశుభ్రతకు అందరు సహకరించాలి: కార్పొరేటర్ శ్రీవాణి

**హుడా కాంప్లెక్స్, జూన్ 3, ప్రభాతవార్త:**
పరిసరాల పరిశుభ్రత కు అందరు సహకరించాలని సరూర్ నగర్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి సూచించారు. జిహెచ్ఎంసి కమిషనర్ గారి ఆదేశాల మేరకు రాబోవు వర్షాకాలం యందు ప్రజారోగ్యము పారిశుద్ధ్య విషయమై ఎదురయ్యే సమస్యలను దృష్టిలో ఉంచుకొని జిహెచ్ఎంసి అన్ని సర్కిల్ ల యందు ముందస్తు వర్షాకాల ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ చేపట్టాలని ఆదేశించినందున, అందులో భాగంగా మంగళవారం సరూర్ నగర్ డివిజన్లో ఈ కార్యక్రమాన్ని ఆకుల శ్రీవాణి , డిప్యూటీ కమిషనర్ సుజాత ప్రారంభించారు. ఇందులో భాగంగా వెంకటేశ్వర కాలనీ శ్రీనివాస కాలనీ ,సరూర్ నగర్ ఓల్డ్ విలేజ్, పోచమ్మ బాగ్ , కుమ్మరి బస్తి, బాపు నగర్, భగత్ సింగ్ నగర్, జైస్వాల్ కాలనీ ప్రాంతాల యందు శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించి కాలనీల రోడ్లను మరియు ఖాళీ ప్రదేశాలను శుభ్రం చేసి ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేసి చెత్తను ఎత్తివేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సరూర్ నగర్ సర్కిల్ పారిశుద్ధ్య విభాగండి ఈ చందన చౌహాన్, సానిటరీ సూపర్వైజర్ బుచ్చయ్య, ఎస్ ఎఫ్ ఏ లు, జవాన్లు మరియు పారిశుద్ధ్య సిబ్బంది మరియు ఎంటమాలజీ విభాగము నుండి అసిస్టెంట్ ఎంటోమోలోజిస్ట్ రాంబాబు మరియు వారి సిబ్బంది పాల్గొని దోమల నివారణకై మందులు స్ప్రే చేశారు పాల్గొన్నారు .ఈ



శానిటేషన్ డ్రైవ్‌లో పాల్గొన్న ఆకుల శ్రీవాణి, డీసీ సుజాత తదితరులు

కార్యక్రమాన్ని ఉద్దేశించి కార్పొరేటర్ శ్రీమతి ఆకుల శ్రీవాణి గారు మాట్లాడుతూ ప్రజలు వారి ఇంటి నుండి మరియు వ్యాపార స్థలాల నుండి వెలువడే చెత్తాచెదారాన్ని ఎక్కడపడితే అక్కడ పడ వేయకుండా జిహెచ్ఎంసి స్వచ్ఛ ఆటో వారికి అందించాలని ఎక్కడపడితే అక్కడ పడవేయడం వలన వర్షాకాలంలో నాళాలు మరియు మోరీలు చెత్తతో నిండిపోవడం వలన వర్షం నీరు కాలనీలలో నిలిచిపోయి దుర్వాసన మరియు ప్రాణాంతకమైన అంటువ్యాధులు ప్రభలే అవకాశం ఉన్నందున ప్రజలందరూ ఈ సూచనలను పాటించాలని ఇంటి పరిసరాలలో నీరు నిలవకుండా అందువల్ల దోమలు అభివృద్ధి చెందకుండా మన వంతు బాధ్యతగా ఉండాలని తెలియజేశారు.

## ఆపరేషన్ సింధూర్ ప్రేరణతో దేశభక్తిని చాటిన ప్రజలు



కార్యక్రమంలో పాల్గొన్న రిటైర్డ్ ఆర్మీ అధికారులు

**ఎల్.బి.నగర్ జూన్ 3 ప్రభాతవార్త:** పాకిస్తాన్లోని ఉగ్రస్తావరాలే లక్ష్యంగా భారత్ ఆర్మీ చేపట్టిన ఆపరేషన్ సింధూర్ ప్రేరణతో ప్రజలు దేశంలో వివిధ రూపాల్లో దేశభక్తిని చాటుకున్నారని రిటైర్డ్ కలెక్టర్ ఎంవి.రెడ్డి పేర్కొన్నారు. కోదాడ ఆత్మీయ ప్రవాస సమితి అపోలో మెడికల్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో సెల్యూట్ టు సోల్జర్స్ పేరుతో చైతన్యపురిలోని అపోలో కాన్ఫరెన్స్ హాలులో సంగోజు నాగాచారి అధ్యక్షతన ఐఏఎస్ రిటైర్డ్ అధికారి బుర్రి రామయ్యతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ రక్షణ బాధ్యతలతో త్రివిధ దళాల అధికారులు సైనికుల సేవలను మనం ఎప్పటికీ గుర్తుంచుకోవాలన్నారు. నేటి యువత ఆర్మీలో చేరే విధంగా అవగాహన కల్పించాలన్నారు. ఆపరేషన్ సింధూర్లో పాల్గొన్న మేజర్ టి సాయి భార్గవ్ తన అనుభవాలను వివరిస్తూ పాకిస్తాన్ డ్రోన్ దాడులను ఎలా తిప్పి కొట్టారో వివరించారు. ఈ కార్యక్రమంలో సుంకర శ్రీనివాస్‌రావు ఆర్మీ మాజీ అధికారులు స్వర్ణరెడ్డి, సుబేదార్ మేజర్ పిఎస్ఎన్. స్వామి, నరసింహారెడ్డి, రామనాథం, వనం సుదర్శన్, దయాకర్ రెడ్డి, ఎస్.నరసయ్యలను ఈ సందర్భంగా సత్కరించారు. పాకిస్తాన్ దాడిలో వీరమరణం పొందిన సైనికులకు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అపోలో అకాడమీ డైరెక్టర్ పి.శ్రీనివాస్ రెడ్డి, ప్రిన్సిపాల్ మధుసూదన్, చైతన్యపురి ఇన్స్పెక్టర్ వెంకటేశ్వరరావు, వాలీబాల్ శ్రీనివాస్, గుడిగ అంజయ్య, కళింగరావు, గుంజ వెంకటేశ్వర్లు, సతీష్, నారాయణరావు, శ్యాంప్రసాద్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి శ్రీధర్ బాబుని కలిసిన మల్లారెడ్డి



మేడ్చల్ జిల్లా ఇన్చార్జ్ మంత్రి శ్రీధర్ బాబుకు వినతి పత్రం అందిస్తున్న మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి , మాజీ జెడ్పిటిసి మంద సంజీవరెడ్డి ,దళిత సంఘం నాయకులు

**బోడుప్పల్ , జూన్ 3 ప్రభాతవార్త ;** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఇంచార్జ్ మంత్రివర్యులు దుద్దిల శ్రీధర్ బాబు ని మేడ్చల్ ఎమ్మెల్యే మాలారెడ్డి తో కలసి బోడుప్పల్ సర్వే నెంబర్స్ 63/2 టు 63/25 బోడుప్పల్ దళితుల ఏ సి 336 ను ల్యాండ్ పులింగ్ ఆగిపోయినా విషయాన్ని ఇన్చార్జ్ మంత్రికి తెలియచేయడం జరిగింది . మంత్రి శ్రీధర్ బాబు వెంటనే స్పందించి హెచ్ఎండిఏ కమిషనర్ , జిల్లా కలెక్టర్ కు వెంటనే ల్యాండ్ పులింగ్ చేసి దళితులకు ఎకరా కు 600 గజాల చొప్పున ఇవ్వాలని ఆదేశాలు ఇవ్వడం జరిగింది . కోర్ట్ కేసులు కొటేపించాలి అని సంబంధిత అధికారుకు ఆదేశాలు ఇవ్వడం జరిగింది .దళితుల పక్షాన ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నా మంత్రి శ్రీధర్ బాబుకు ఎమ్మెల్యే మల్లారెడ్డి కి ధన్యవాదులు తెలియజేశారు.మంత్రిని కలిసిన వారిలో మాజీ జడ్పీటీసీ మంద సంజీవరెడ్డి , అంబేద్కర్ సంఘ మాజీ అధ్యక్షులు మీసాల కృష్ణా , కామగాళ్ళ నర్సిహ , చిన్నిగాళ్ల కుమార్ అంబేద్కర్ సంఘం ప్రధాన కార్యదర్శి చంటి శ్రీనివాస్ అంబేద్కర్ సంఘం ఉపఅధ్యక్షులు ఉప్పరి విజయ్ పాల్గొన్నారు.

## గృహిణి అదృశ్యం

**నేరెడ్ మెట్, జూన్ 3,ప్రభాతవార్త :** కుమారునితో గొడవపడి ఇంటి నుంచి వెళ్ళిన తల్లి అదృశ్యమైన సంఘటన నేరెడ్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై సైదులు తెలిపిన వివరాల ప్రకారం నేరేడ్మెట్ కాకతీయ నగర్ ప్రాంతం చెందిన సీనావత్ రాములు నాయక్ భార్య సీనావత్ కౌసల్య (52) గత నెల 25న తన కుమారుడు వినోద్ కుమార్ తో చిన్న పాటి గొడవ జరగడంతో తల్లి ఇంటి నుంచి వెళ్ళిపోయింది. నాట్ నుంచి ఇరుగు పొరుగు ప్రాంతాలలో, బంధువుల ఇళ్లలో వెతికిన తన ఆచూకీ లభించకపోవడంతో నేరెడ్ మే ట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమెర కు పోలీసులు కేసు నమోదు చెసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## ఫుల్ అడిషనల్ చార్జ్ ఉన్నత శ్రేణి కార్యదర్శిగా చిలుకా నరసింహారెడ్డి



**మలక్ పేట ,జూన్ 3, ప్రభాతవార్త:** హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ గ్రేడ్1 కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న చిలుక నరసింహారెడ్డిని ఉన్నతశ్రేణి కార్యదర్శిగా ఫుల్ అడిషనల్ ఛార్జ్ (ఎఫ్ఎసి) గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాగా ఆయన బాధ్యతలు తీసుకోవడం జరిగింది. ఎస్ జి ఎస్ గా బాధ్యత నిర్వహిస్తున్న దామోదర్ పదవీ విరమణ చేయడంతో రాష్ట్ర ప్రభుత్వం చిలుక నరసింహారెడ్డిని ఉన్నతశ్రేణి కార్యదర్శిగా ఫుల్ అడిషనల్ ఛార్జ్ (ఎఫ్ఎసి) గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా చిలుక నరసింహారెడ్డి మాట్లాడుతూ రైతులకు మెరుగైన గిట్టుబాటు ధరలు అందించడానికి కృషి చేస్తామని తెలిపారు. రైతులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారి అభ్యున్నతికి తోడ్పడుతామని పేర్కొన్నారు. ఉన్నత శ్రేణి కార్యదర్శిగా ఫుల్ అడిషనల్ ఛార్జ్ (ఎఫ్ఎసి) గా బాధ్యతలు చేపట్టిన చిలుకా నరసింహారెడ్డిని హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చేకోలేకర్ లక్ష్మి, టిపిసిసి ప్రధాన కార్యదర్శి చెకోలేకర్ శ్రీనివాస్, వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్, డైరెక్టర్లు దుగ్గు జగదీష్, మాదారం కృష్ణ, తెలంగాణ చాంబర్ ఆఫ్ అగ్రి ట్రేడర్స్ అధ్యక్షుడు చేగురు వెంకటరమణ తదితరులు పుష్పగుచ్ఛాలను అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

## సైదాబాద్‌లో జిహెచ్ఎంసి మాన్సూన్ స్పెషల్ డ్రైవ్



మాన్సూన్ స్పెషల్ డ్రైవ్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి

**సైదాబాద్, జూన్ 2 ప్రభాతవార్త:** సైదాబాద్ డివిజన్‌లో జిహెచ్ఎంసి పారిశుధ్య, ఎంటమాలజి విభాగాల ఆధ్వర్యంలో చేపడుతున్న మాన్సూన్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి, డిసి జయంత్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ అరుణ మాటాడుతూ డివిజన్‌లోని అన్ని కాలనీలు, బస్తీలలో రోడ్లపై ఉన్న చెత్త కుప్పలు, మట్టి, చెట్ల కొమ్మలను తొలగించాలని సిబ్బందికి సూచించారు. మూడు రోజుల పాటు స్పెషల్ డ్రైవ్ కొనసాగనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంహెచ్ఓ రుద్ర శ్రీనివాస్, ఎస్ఎఫ్ఏలు చంద్ర ప్రకాష్, కళ్యాణ్, దేవేందర్, సలావుద్దీన్, ఫజల్, సాయి కిరణ్, రాంకి సంస్థ ప్రతినిధి దినేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మూడు నెలల సన్నబియ్యం కోటా పంపిణీ

**సైదాబాద్, జూన్ 2 ప్రభాతవార్త:** రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అహార భద్రత కార్డుదారులందరికి మూడు నెలల సన్నబియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేయాలని నిర్ణయం తీసుకోవడం జరిగిందని లింగోజిగూడ డివిజన్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు కందికంటి శ్రీధర్‌గౌడ్ అన్నారు. డివిజన్‌లోని రేషన్ దుకాణాన్ని సందర్శించి లబ్దిదారులతో మాట్లాడిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పేదలందరు సన్నబియ్యంతో అన్నం తినాలన్న ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి దేశంలో మరెక్కడా లేని విధంగా రేషన్ లబ్దిదారులకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నారని అన్నారు.

## పద్మశ్రీ మంద కృష్ణమాదిగతో వేముల చిన్న బేటి



పద్మశ్రీ మంద కృష్ణమాదిగతో బేటి అయిన వేముల చిన్న తదితరులు

**ఉప్పల్, జూన్ 3 ప్రభాతవార్త :** ఎస్సీ వర్గీకరణ కోసం మూడు దశాబ్దాలుగా పోరాటం చేస్తున్న పద్మశ్రీ మంద కృష్ణ మాదిగతో మంగళవారం ఉప్పల్ నియోజకవర్గం ఎంఆర్‌పిఎస్ సీనియర్ నాయకులు వేముల చిన్న బేటి అయ్యారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం మంద కృష్ణమాదిగ చేసిన పోరాటం మరువలేనిదన్నారు. భారత రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు అందుకోవడం అభినందనీయమన్నారు. ప్రజా ఉద్యమాలకు మంద కృష్ణ మాదిగ స్ఫూర్తిగా నిలిచారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు నిధులు కేటాయించండి : పరమేశ్వర్‌రెడ్డి



గ్రేటర్ కమిషనర్ ఆర్‌వి కర్ణన్‌కు వినతి పత్రం అందజేస్తున్న కాంగ్రెస్ ఇంచార్జీ ఎం.పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

**ఉప్పల్, జూన్ 3 ప్రభాతవార్త :** ఉప్పల్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ మందముల పరమేశ్వర్‌రెడ్డి గ్రేటర్ కమిషనర్ ఆర్‌వి.కర్ణన్‌ను కలిసి విన్నవించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎం.పరమేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గం పరిధిలోని కాప్రా సర్కిల్‌లో పలు కాలనీలలో పనులు పెండింగ్‌లో ఉన్నాయని, రహదారులు శిథిలావస్థకు చేరాయని విన్నవించారు. సిఎం రేవంత్‌రెడ్డి సూచన మేరకు కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేసినట్లు ఆయన తెలిపారు.దీనిపై గ్రేటర్ కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.పనులకు త్వరలోనే మంజూరు లభిస్తుందని తెలిపారు.

## వంద రోజుల యాక్షన్ ప్లాన్‌పై అవగాహన



తడి చెత్త-పొడి చెత్తలపై మహిళలకు అవగాహన కల్పిస్తున్న మీర్‌పేట్ కమిషనర్ జ్ఞానేశ్వర్

**సరూర్‌నగర్, జూన్ 3 ప్రభాతవార్త:** మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక 45వ డివిజన్‌లో ప్రజలు పలు విషయాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమీషనర్ ఆర్.జ్ఞానేశ్వర్ పలువురు అధికారులతో కలిసి డివిజన్‌లో పర్యటించి వీధి కుక్కల నియంత్రణ, తడి-పొడి చెత్త వేరు చేసి స్వచ్ఛ ఆటోలకు ఇచ్చుట తదితర విషయాలపై కాలనీల ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ మాజీ కార్పొరేటర్ అక్కి మాధవి ఈశ్వర్‌గౌడ్, కార్పొరేషన్ సానిటరీ ఇన్స్‌పెక్టర్, ఎన్విరానమెంట్ ఇంజనీర్, టౌన్ మిషన్ కో-ఆర్డినేటర్, వార్డు ఆఫీసర్లు, కార్పొరేషన్ సిబ్బంది, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

## వంద రోజుల కార్యాచరణపై అవగాహన ర్యాలీ



జెండా ఊపి ర్యాలీని ప్రారంభించిన బడంగ్‌పేట్ స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్‌రెడ్డి: చిత్రంలో కమీషనర్ సరస్వతి తదితరులు

**సరూర్‌నగర్, జూన్ 3 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో మంగళవారం వంద రోజుల కార్యాచరణ ప్రణాళికపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన కార్పొరేషన్ ప్రత్యేకాధికారి పి.శ్రీనివాస్‌రెడ్డి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. అంతకు ముందు ఆయన కార్పొరేషన్ అధికారులు, సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయించారు. ఆ తర్వాత డ్వాక్రా మహిళలు ఏర్పాటు చేసిన స్టాల్‌ను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ సరస్వతి, అసిస్టెంట్ కమీషనర్ శ్యామ్ సుందర్, డిఇఇ వెంకన్న, మేనేజర్ నాగేశ్వర్‌రావు, సానిటరీ ఇన్స్‌పెక్టర్ వంకాయల యాదగిరిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

## అల్మాస్‌గూడ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానం హుండీ ఆదాయం రూ.1,75,921



ఛైర్మన్ బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి సమక్షంలో హుండీ ఆదాయాన్ని లెక్కించిన కమిటీ సభ్యులు

**సరూర్‌నగర్, జూన్ 3 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని అల్మాస్‌గూడ శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయ హుండీ ఆదాయం రూ.1,75,921 వచ్చింది. దేవాలయ ట్రస్ట్ ఛైర్మన్ బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం ట్రస్ట్ సభ్యులు, భక్తుల సమక్షంలో హుండీలను తెరిచి లెక్కింపు జరిపారు. ఈ నేపథ్యంలో నగదు రూపంలో భక్తులు సమర్పించిన మొత్తం రూ.1,75,921 ఉన్నట్లు తేలింది. ఈ మేరకు సదరు మొత్తాన్ని ఆలయ ఖాతాలో జమ చేయనున్నట్లు ఛైర్మన్ రాఘవేందర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో రామిడి రాజిరెడ్డి, రామిడి సుభాష్‌రెడ్డి, పగడాల మురళి, హైమవతి, మల్‌రెడ్డి నర్సింహారెడ్డి, మణికాంత్‌రెడ్డి, రామిడి దేవేందర్‌రెడ్డి, అర్చకులు, పాల్గొన్నారు.

## వర్షాకాలంలో ఇబ్బందులు జరగకుండా చర్యలు: చింతల



అరుణసురేందర్‌యాదవ్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

**ఎల్.బి.నగర్ జూన్ 3 ప్రభాతవార్త:** వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామని నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణసురేందర్‌యాదవ్ పేర్కొన్నారు. నాగోల్ డివిజన్ పరిధిలోని అరుణోదయకాలనీ రోడ్ నెంబర్ 8లో జిహెచ్ఎంసి ఆధ్వర్యంలో మంగళవారం ముందస్తు వర్షాకాల శానిటేషన్ ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ యాదయ్య ఇతర అధికారులు, కాలనీవాసులతో కలిసి కార్పొరేటర్ పర్యటించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ నాగోల్ డివిజన్లోని అన్ని కాలనీలు పరిశుభ్రంగా ఉండే విధంగా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. కాలనీవాసులు కూడా జిహెచ్ఎంసి వారికి సహకరించాలని కోరారు.

## చిలుకానగర్‌లో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ : బన్నాల గీత



చిలుకానగర్‌లో శానిటేషన్ డ్రైవ్ కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ బన్నాల గీత, డిఇ చందన తదితరులు

**ఉప్పల్, జూన్ 3 ప్రభాతవార్త :** వర్షాకాలంలో పారిశధ్య నిర్వహణ విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని చిలుకానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం జిహెచ్ఎంసి ఆధ్వర్యంలో డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ వర్షాకాలంలో రోడ్లపై నీరు నిల్వ ఉండకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. దోమల నివారణకు చెత్తాచెదారం లేకుండా చూసుకోవాలని కోరారు. మోరీలలో చెత్తాచెదారం ఉండడం వల్ల దుర్వాసనలతో ఇబ్బందులు వస్తాయని, పారిశుధ్యం పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. శానిటేషన్ డిఇ చందన చౌహాన్ మాట్లాడుతూ జిహెచ్ఎంసి నేటి నుంచి ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ చేపడుతుందన్నారు. చెత్త ఆటోలకు చెత్త ఇవ్వాలని, రోడ్లపై చెత్త వేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంటమాలజీ ఎఇ నరేష్‌రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, ఏదుల కొండల్‌రెడ్డి, ఆర్.బలరామ్, జిల్లాల ప్రవీణ్, కాలనీ సంఘం నేతలు అశోక్‌చారి, సుందర్, ఉపేందర్, సంతోష్‌రెడ్డి, పాండు, స్వామియాదవ్,పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.